RNI TELTEL/2024/89620

తెలంగాణ

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 121 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | ఆదివారం - 21 - జూన్ - 2026 | వెల రూ. 5 /-

పీఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

వివరాలు 2 లో..

మెట్రో పెండింగ్ సమస్యలపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ

- రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి
- అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవు తానని వెల్లడి
- జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి

నేటి శుభోదయ, హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఐఆర్ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

అయోధ్యలో తిరుమల మోడల్..

- టీటీడీ తరహా పాలనకు నృపేంద్ర మిశ్రా ప్రతిపాదన

- అయోధ్య విరాళాల వివాదంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ
- ఆలయానికి తిరుపతి తరహా పాలన ఉండాలని నృపేంద్ర మిశ్రా సూచన
- సీఈవో నియామకం, పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని ప్రతిపాదన
- నిజానిజాలు తేలుస్తామన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

నేటి శుభోదయ, అయోధ్య : అయోధ్య రామ మందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా కీలక ప్రతిపాదన చేశారు. ఆలయ నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అయోధ్యలో కూడా వృత్తిపరమైన పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. విరాళాలు, హుండీ కానుకల లెక్కింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తనను తీవ్రంగా బాధించాయని, ఇవి భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని నృపేంద్ర మిశ్రా అన్నారు. ఈ నేపథ్యంలో, ఆలయ ట్రస్టు విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడిన నృపేంద్ర మిశ్రా, ఆలయ నిర్వహణ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో పనిచేసిన అనుభవం ఉన్న ఒక స్వతంత్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)ను నియమించాలని, ఉన్నతస్థాయిలో సిబ్బంది నియామకాలను క్రమబద్ధీకరించాలని సూచించారు. టీటీడీలో కమిషనర్ స్థాయి అధికారి సుదీర్ఘకాలం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించే విధానాన్ని ఆయన ఉదహరించారు.

కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

- తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

- కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం
- బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి
- కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ

నేటి శుభోదయ, హైదరాబాద్ : తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ....

2

హర్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్..

- చమురు సరఫరాపై తీవ్ర ఆందోళన!

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా హర్ముజ్ జలసంధి మూసివేత
- కీలకమైన జలమార్గంపై మళ్లీ పూర్తి నియంత్రణ ప్రకటించిన ఇరాన్
- ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం



నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ : మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ప్రతిస్పందనగా, ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. గత కొద్ది వారాల్లోనే ఇరాన్ ఇటువంటి చర్యకు పాల్పడటం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయెల్ లెబనాన్‌పై నిరంతర దాడులకు పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 16 నుంచి 32 మంది వరకు మరణించినట్లు లెబనాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ దాడులకు నిరసనగానే హర్ముజ్ జలసంధిపై తాము పూర్తి నియంత్రణను తిరిగి చేపట్టినట్లు ఇరాన్ సైనిక కమాండ్ స్పష్టం చేసింది.

లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. - హైడ్రా కమిషనర్ రంగనాథ్

- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

2

నేటి శుభోదయ, హైదరాబాద్ : హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటి వరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు. హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ .....

2

పోక్సో కేసు.. బండి భగీరథ్‌కు బెయిల్

- పోక్సో కేసులో నెల రోజులుగా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్
- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన మల్కాజ్‌గిరి కోర్టు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన భగీరథ్ వ్యవహారం

హైదరాబాద్‌కు వర్ష సూచన..

- పలు జిల్లాలకు పిడుగుల హెచ్చరిక

- హైదరాబాద్ సహా పలు తెలంగాణ జిల్లాలకు ఉరుముల వర్ష సూచన
- నగరంలోని ఘట్‌కేసర్, ఉప్పల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో ఇప్పటికే వర్షం
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ
- ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం

2

పీఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల

మొదటిపేజీ తరువాయి..

నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ : ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు pmkisan.gov.in వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

- తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

పోక్సో కేసు.. బండి భగీరథ్‌కు బెయిల్

మొదటిపేజీ తరువాయి..

నేటి శుభోదయ, హైదరాబాద్ : తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు. ఆ తర్వాత మేజ్రల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో, భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.

హైదరాబాద్‌కు వర్ష సూచన..

- పలు జిల్లాలకు పిడుగుల హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి..

నేటి శుభోదయ, హైదరాబాద్ : తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకోవడంతో పాటు, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. సంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, యాదాద్రి-భువనగిరి, నల్గొండ, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో రాబోయే కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నగర శివార్లలోని నారపల్లి, రాంపల్లి, ఘట్‌కేసర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, హయత్‌నగర్, నాగోల్ వంటి ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిశాయి. రాత్రికి నగరం అంతటా వర్షాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. భారత వాతావరణ శాఖ సూచనల ప్రకారం, పిడుగులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.

లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం..

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

మొదటిపేజీ తరువాయి..

ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్య నగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

రూ.10 లక్షల కోట్ల అప్పు..

- విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

నేటి శుభోదయ, తమిళనాడు : తమిళనాడు రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'వుయ్ ది లీడర్' వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక 'పోస్ట్‌మార్టమ్' లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని

ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

రోగుల భద్రతపై కేంద్రం కీలక నిర్ణయం..
దేశవ్యాప్తంగా 16 రకాల మందులపై బ్యాన్

నేటి శుభోదయ, హైదరాబాద్, జూన్ 19 :

దేశంలో రోగుల భద్రతను బలోపేతం చేయడం, ఔషధాల హేతుబద్ధ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందుల తయారీ, అమ్మకం, పంపిణీపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940లోని సెక్షన్ 26ఏ కింద ఈ నిషేధాన్ని విధించారు. భారత మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందులపై సమగ్ర సమీక్ష జరపాలని సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను కలిపి ఒకే ఔషధంగా తయారు చేయడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ అంటారు. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ ఎఫ్‌డీసీ మందులపై ఈ కమిటీ లోతైన శాస్త్రీయ విశ్లేషణ జరిపింది. వాటి భద్రత, సమర్థత, చికిత్సా విలువలను అంచనా వేసింది. ఈ సమీక్షలో 16 రకాల ఎఫ్‌డీసీ మందులకు సరైన చికిత్సాపరమైన హేతుబద్ధత లేదని, వాటిని వాడటం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని కమిటీ తేల్చింది. ఈ మందుల వల్ల కలిగే ప్రయోజనాల కంటే వాటితో ముడిపడి ఉన్న నష్టాలే ఎక్కువగా ఉన్నాయని తన నివేదికలో పేర్కొంది. నిపుణుల కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ 16 మందులను నిషేధించాలని నిర్ణయించింది. నిషేధిత మందుల జాబితాలో కొన్ని చర్మ సంబంధిత (డెర్మటలాజికల్) ఉత్పత్తులు, నొప్పి నివారణ మందులు, కడుపునొప్పిని తగ్గించే యాంటిస్పాస్మోడిక్ డ్రగ్స్‌తో పాటు కొన్ని యాంటీబయాటిక్ ఆధారిత ఫార్ములేషన్లు కూడా ఉన్నాయి. ఈ కాంబినేషన్లకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేవని, అవి హేతుబద్ధంగా లేవని ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ప్రజలకు సురక్షితమైన, సమర్థవంతమైన, శాస్త్రీయంగా ధ్రువీకరించబడిన మందులు మాత్రమే అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో కూడా ఇలాంటి హేతుబద్ధత లేని డ్రగ్ కాంబినేషన్లపై

శాస్త్రీయ సమీక్షల అనంతరం నిషేధం విధించినట్లు గుర్తుచేసింది. తాజా నోటిఫికేషన్‌తో ఈ 16 మందుల తయారీ, అమ్మకం, దిగుమతి, పంపిణీపై దేశవ్యాప్తంగా నిషేధం అమలవుతుంది. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లను, రెగ్యులేటరీ ఏజెన్సీలను కేంద్రం ఆదేశించింది. తయారీదారులు, పంపిణీదారులు వెంటనే ఈ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించింది. ఆధారిత ఆరోగ్య సంరక్షణ, రోగుల భద్రత పట్ల తమ నిబద్ధతను ఈ చర్య మరోసారి రుజువు చేస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

రైళ్లలో టికెట్ లేకుండా జర్నీ చేస్తున్నారా?.. ఇకపై జరిమానా రెట్టింపు..!

నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :

రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించే వారిపై భారతీయ రైల్వే శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సరైన టికెట్ లేకుండా లేదా చెల్లని టికెట్లతో ప్రయాణించే వారి నుంచి వసూలు చేసే కనీస జరిమానాను రెట్టింపు చేసింది. ఇప్పటివరకు రూ.250గా ఉన్న ఈ జరిమానాను రూ.500కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనలు నేటి (జూన్ 20) నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) చట్టం-2026 కింద ఈ మార్పులు చేసినట్లు

రైల్వే మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. జూన్ 19న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రైల్వే చట్టం-1989లోని సెక్షన్ 137, 138లకు సవరణలు చేశారు. దీని ప్రకారం టికెట్ లేకుండా పట్టుబడిన ప్రయాణికులు తాము ప్రయాణించిన దూరం లేదా ప్రయాణం ప్రారంభించిన స్టేషన్ నుంచి వర్తించే ఛార్జీని చెల్లించాలి. దానికి అదనంగా ఆ ఛార్జీకి సమానమైన మొత్తాన్ని జరిమానాగా కట్టాలి. అయితే, ఈ రెండు మొత్తాలూ కలిపి ఏమాత్రం తక్కువైనా, కనీస జరిమానాగా రూ.500 వసూలు చేస్తారు. ఒకవేళ ప్రయాణికుడు ఎక్కడ నుంచి ఎక్కాడో స్పష్టంగా చెప్పలేకపోతే, రైలు బయలుదేరిన స్టేషన్ లేదా అంతకుముందు టికెట్ తనిఖీ జరిగిన స్టేషన్ నుంచి ఛార్జీ లెక్కిస్తారు.

భారత వైమానిక దళంలో (అగ్నివీర్‌వాయు) ఎంపికైన సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థి

నిజామాబాద్ రూరల్, సిరికొండ, నేటి శుభోదయ :

భారత వైమానిక దళంలో అగ్నివీర్‌వాయు గా సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థి రావుట్ల జగదీష్ ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. దేశ రక్షణలో కీలకమైన వైమానిక దళంలో సేవలందించే అవకాశాన్ని పొందిన ఆయన విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి తన కృషి, క్రమశిక్షణ, అంకితభావంతో భారత వైమానిక దళంలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాల సాధనకు నిరంతర శ్రమ, పట్టుదల మరియు దేశభక్తిని అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని జగదీష్‌ను అభినందించడమైనది.

సిరికొండ ఎంపీడీవో కె.ఆర్. మనోహర్ రెడ్డికి ఘన సన్మానం

నిజామాబాద్ రూరల్, సిరికొండ, నేటి శుభోదయ :

సిరికొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గౌరవ శ్రీ కె.ఆర్. మనోహర్ రెడ్డి గారిని సిరికొండ సర్పంచ్ సాయిచరణ్ మరియు ఉప సర్పంచ్ గ్రామ శోభన్ గార్లు ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సాయిచరణ్ మాట్లాడుతూ... దాదాపు రెండు సంవత్సరాలుగా సిరికొండ ఎంపీడీవోగా విధులను నిర్వహిస్తూ, మండల అభివృద్ధికి మనోహర్ రెడ్డి గారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, ప్రతి ప్రజా ప్రతినిధిని మరియు ప్రతి నాయకుడిని కలుపుకుంటూ, వారు అడిగిన వెంటనే స్పందించి, ఎంతో మంచి మనసుతో అందరికీ సేవలందించారని గుర్తుచేసుకున్నారు.భవిష్యత్తులో మరెన్నో ఉన్నత ప్రమోషన్లు పొంది, పెద్ద స్థానాల్లో స్థిరపడాలని, ఎక్కడున్నా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని తాము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు సర్పంచ్ మల్లెల సాయిచరణ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఆరేళ్ల సేవలకు ఘన వీడ్కోలు..

- కొత్త కార్యదర్శికి హృదయపూర్వక స్వాగతం

కేశంపేట, నేటి శుభోదయ :

కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల సన్మాన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గత ఆరు సంవత్సరాలుగా గ్రామంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్‌కు ఘనంగా వీడ్కోలు పలుకుతూ శాలువా కప్పి సన్మానించారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. అవినాష్ గౌడ్ తన పదవీకాలంలో గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేశారని కొనియాడారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు.నూతన కార్యదర్శి తిరుపతయ్య కూడా ప్రజలకు చేరువగా ఉంటూ గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. గ్రామ అభ్యున్నతికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి నాయక్, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, చిట్టిరెడ్డి వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు లచ్చిరాం నాయక్, పోగుల నరేష్, నరసింహులు, గుత్తి చంద్రయ్య, కందన సంతోష్ శివయ్య, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, గుత్తి శేఖర్, శంభుల శేఖర్, చిట్టిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఆధికారి రామోజీ రమేష్ ను సత్కరించిన శెట్టి

ఖమ్మం, నేటి శుభోదయ : ఇటీవల కాలంలో ఎస్ పి గా ప్రమోషన్ పొందిన పోలీసు అధికారి రామోజీ రమేష్ ను శనివారం ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియచేసిన మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు. రక్షణ రంగంలో తనకంటూ ఒక ఆమోదయోగ్యమైన ముద్ర వేయించుకున్న రామోజీ రమేష్ నేడు ఎస్ ఐ నుండి ఎస్ పి వరకు ఎదగడం హర్షణీయమని, తమకు అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు అత్యంత ఆప్తుడని,విధి నిర్వహణలో జిల్లా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అన్ని వర్గాల ప్రజలతో మమేకమైన వ్యక్తి అని కొనియాడారు.

మంత్రి తుమ్మల ను శాలువాతో సత్కరించిన ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం, నేటి శుభోదయ : ఖమ్మం నగరంలో గల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో శనివారం ఖమ్మం నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్స్ సమావేశాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం తో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిసిసి అర్బన్ అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కోసూరి ప్రసాద్, పాలకుర్తి నాగేశ్వరరావు, ఖమ్మం నగర కార్యదర్శులు కల్వల శ్రీనివాసరావు, ముజీబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మాజీ సర్పంచ్ కుమారుడి అడ్మిషన్

- ఆదర్శంగా నిలిచిన మంజుల బాలయ్య

నిజామాబాద్ రూరల్, సిరికొండ, నేటి శుభోదయ :

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా గోనుగొప్పుల గ్రామంలో ఒక మంచి పరిణామం చోటుచేసుకుంది. పోతునూర్ గ్రామ మాజీ సర్పంచ్ మంజుల బాలయ్య విద్యావ్యవస్థపై తనకున్న నమ్మకాన్ని చాటుకుంటూ, ఈరోజు గోనుగొప్పుల గ్రామంలోని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలో తన కుమారుడిని చేర్పించారు (అడ్మిషన్ చేయించారు).ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గోనుగొప్పుల గ్రామ సర్పంచ్ సేపూర్ చరణ్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా సమాజంలో ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరుగుతుందని, ఇది అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం), ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు పాల్గొని, ప్రభుత్వ పాఠశాలను ఎంచుకున్నందుకు మాజీ సర్పంచ్ మంజుల బాలయ్య గారిని ప్రత్యేకంగా అభినందించారు.

రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

(నిజామాబాద్ రూరల్, డిచ్ పల్లి, నేటి శుభోదయ : నిజామాబాద్ జిల్లా లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (TGSWREIS) ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్సీ, బిసి మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని నిజామాబాద్ జిల్లా గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థినులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రవేశాలు పొందాలనుకునే వారు నిజామాబాద్‌లోని సంబంధిత కళాశాలను నేరుగా సంప్రదించి, తమ దరఖాస్తులను సమర్పించాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

తన కూతురు, సన్నిహితులతో కలిసి యాదాద్రి దివ్య క్షేత్రం సందర్శించిన ఎంపి వద్దిరాజు రవిచంద్ర

యాదాద్రి భువనగిరి, ఖమ్మం, నేటి శుభోదయ : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన కూతురు డాక్టర్ గంగుల గంగా భవాని, సన్నిహితులు మోహన్ యశ్వంత్ పాటిల్, సుమిత అరుణ్ సింగ్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శనివారం ఉదయం యాదాద్రి దివ్య క్షేత్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వారు శ్రీలక్ష్మీనర్సింహా స్వామిని దర్శించుకుని తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు.ఎంపి రవిచంద్రతో కలిసి ఆలయానికి విచ్చేసిన వారికి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మేళ తాళాలతో సాదర స్వాగతం పలికారు.ఎంపీ వద్దిరాజు,మోహన్ యశ్వంత్ పాటిల్, శ్రీనివాస్ రెడ్డిలకు వేద పండితులు పూలమాలలు వేసి,కండువాలతో సత్కరించి ఆశీర్వచనాలు పలికారు, శ్రీలక్ష్మీ నరసింహాస్వామి తీర్థ ప్రసాదాలు బహుకరించి గౌరవించారు.

హర్యాతండ గ్రామంలో నవ దంపతులను ఆశీర్వదించిన సర్పంచ్ బానోత్ స్వాతి రమేష్, ఉపసర్పంచ్ శ్రీను నాయక్

ఖమ్మం, నేటి శుభోదయ : రఘునాధపాలెం మండలం హర్యాతండ గ్రామానికి చెందిన నరేష్–శ్రీలత నూతన దంపతులను గ్రామ సర్పంచ్ బానోత్ స్వాతి రమేష్, ఉపసర్పంచ్ శ్రీను నాయక్ ఆత్మీయంగా కలిసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు నవ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం అన్యోన్యత, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సిరిసంపదలతో కలకాలం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.అనంతరం సర్పంచ్ బానోత్ స్వాతి రమేష్, ఉపసర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ నవ దంపతులు పరస్పర ప్రేమాభిమానాలతో ఆదర్శవంతమైన కుటుంబ జీవితాన్ని గడుపుతూ సమాజంలో ఉన్నత స్థానాన్ని పొందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, ప్రసాద్‌రావు, బానోత్ బహుసింగ్, మాలోత్ రమేష్, మాలోత్ నవీన్, భూక్య నాగేశ్వర రావు, గ్రామ దీపికతో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొని నూతన దంపతులకు శుభాభినందనలు తెలిపారు.గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దల సమక్షంలో ఆప్యాయతలు, ఆశీస్సుల నడుమ జరిగిన ఈ శుభ కార్యక్రమం హర్షాతిరేకాల మధ్య ఘనంగా జరిగింది.

వర్తక సంఘంలో మహిళల కొరకు సేల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఖమ్మం, నేటి శుభోదయ : సత్య మార్గం యూత్ సర్వీసెస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న మహిళల సాధికారత కొరకు వారిచే తయారుచేయబడిన ఆహారపదార్థములు, హెర్బల్ పౌడర్స్, మహిళల కొరకు తక్కువ ధరకు చీరలు, సౌందర్య సాధనములు, రెడీమేడ్ దుస్తులు తదితర 30 స్టాల్స్ ను శనివారం స్థంభాద్రి సేవా సమితి కన్వీనర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తూములూరి లక్ష్మీ నరసింహారావు ప్రారంభించిన తదుపరి మహిళలచే ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను పరిశీలించి, నగర ప్రజలకు, మహిళలకు తక్కువ ధరలో అందుబాటులో ఉంచినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు సర్వే నగేష్ –లక్ష్మీ లకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులతో పాటు సేవా సమితి సభ్యులు సుంకర యల్లారావు, పల్లా లింగయ్య, జంగిలి రమణ, దేవరశెట్టి రామారావు, సూరినేటి మల్లేశం, మోతుకూరి భద్రయ్య తదితరులతో పాటు ఛాంబర్ సభ్యులు పాల్గొన్నారు.

నగర పాలక, పురపాలక సిబ్బందికి 'కరదీపిక' ఎంతో ప్రయోజనకరం

- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం, నేటి శుభోదయ : ఖమ్మం నగర పాలక సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న అకౌంట్స్ ఆఫీసర్లు, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, సీనియర్ అకౌంటెంట్లు రోజువారీ పనిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓలు), సర్క్యులర్లను ఒక పుస్తకంలో సమగ్రంగా పొందుపరచడం అభినందనీయం అని ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. తెలంగాణ మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు , జిడబ్ల్యూఎంసి అకౌంట్ అధికారి కోడి శివలింగం, అసోసియేషన్ కోశాధికారి, కేఎంసి అకౌంట్ అధికారి చింతా శ్రీనివాస రెడ్డి సంయుక్తంగా రూపొందించిన హ్యాండ్ బుక్ (కరదీపిక) ను శనివారం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లడుతూ నగర పాలక సంస్థలు, పుర పాలికల్లో పనిచేస్తున్న కమిషనర్లు, అకౌంట్స్, ఇంజనీరింగ్, ఆడిట్ విభాగాల అధికారులు, ఉద్యోగులకు మార్గదర్శిగా నిలిచేలా "హ్యాండ్ బుక్"ను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ప్రతీ అకౌంట్స్ అధికారి, ఉద్యోగి యొక్క విధులు–బాధ్యతలు, పీడీ అకౌంట్స్ నిర్వహణ విధానం, విధిగా అమలు చేయాల్సిన చట్టబద్ధమైన రికవరీల చెల్లింపుల వివరాలను ఇందులో స్పష్టంగా పొందు పరిచారన్నారు. అనేక విషయ సూచికలతో రూపొందించిన ఈ పుస్తకాలు కొత్తగా ఉద్యోగాల్లోకి చేరేవారికి చాలా ఉపయోగ కరమన్నారు. పుస్తక రచయిత, ఖమ్మం కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి చింత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్, నగరపాలక సంస్థల సిబ్బందికి రోజువారీ విధుల్లో ఎదురయ్యే సవాళ్లను, సమస్యలను అధిగమించేందుకు ఈ కరదీపిక ఒక అద్భుత గైడ్‌లా ఉపయోగ పడుతుందన్నారు. ఈ పుస్తక రూపకల్పనకు సహకరించి, ప్రోత్సహించిన మున్సిపల్ కమిషనర్ కి, ఇతర ఉన్నతాధి కారులకు, శ్రేయోభిలాషులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్లు వి.సతీష్, ఏ.ఉపేందర్, జూనియర్ అకౌంటెంట్లు ఆశకుమారి, మానస, సిబ్బంది పాల్గొన్నారు.

సింగాయిపల్లి అంగన్‌వాడిలో ఘనంగా అక్షరాభ్యాసం

శామీర్ పేట, నేటి శుభోదయ :
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్ సింగాయిపల్లి గ్రామ అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారుల కోసం శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు జమున ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్డీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, మహమ్మద్ జాఫర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శుభారంభం చేశారు. విద్య జీవితానికి పునాది అని, చిన్న వయస్సులోనే విద్యపై ఆసక్తి పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అంగన్‌వాడి కేంద్రాలు పిల్లల మానసిక, శారీరక వికాసానికి తోడ్పడటంతో పాటు ప్రాథమిక విద్యకు బలమైన పునాదిని వేస్తున్నాయని కొనియాడారు. ప్రతి చిన్నారి విద్యావంతుడిగా ఎదగాలని ఆకాంక్షిస్తూ తల్లిదండ్రులు పిల్లల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు

సర్ పేరుతో ఓట్లు చోరీ చేస్తున్న బిజేపి

- **ప్రజలను పీడుస్తున్న అధికారుల మొండి వైఖరికి నిరసనగా సిపిఐ ఆధ్వర్యంలో ఆర్ డి ఓ కార్యాలయం ఎదుట ధర్నా**

ఖమ్మం, నేటి శుభోదయ :
కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లు ను చోరీ చేస్తున్న బిజేపి విధానం సరికాదు అని శనివారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన అనంతరం ఖమ్మం ఆర్ డి ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజల హక్కులను కాలరాస్తు వారి ఓటు హక్కును హరించటం కోసం పూర్తిగా గుప్పిట్లో పెట్టుకోవటం కోసం మైనార్టీలు, ఎస్ సి, ఎస్ టి, బిసి ల ఓట్ల ను తొలగించడం కోసం ఒక ప్రణాళిక ప్రకారంగా సర్ ని సాకు గా తీసుకోవచ్చారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొహ్మద్ సలాం తెలిపారు. దీనికి అధికారులు సొమ్ము చేసుకుంటున్నారని షరతులు లేకుండా కుల ధ్రువీకరణ పత్రం, స్థానిక గుర్తింపు పత్రం వెంటనే మంజూరు చెయ్యాలని ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని డిమాండ్ చేస్తూ ఆర్ డి ఓ కార్యాలయం ఎదుట సిపిఐ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మొహమ్మద్ సలాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న స్వార్థపరమైన విధానాలను మతోన్మాదాన్ని ప్రజలను అడ్డం పెట్టుకొని సర్ రూపంలో ఇబ్బంది పెడుతున్నారు అని సలాం తీవ్రంగా విమర్శించారు. సర్టిఫికెట్లు ఏ ధ్రువీకరణ పత్రమైన ఆన్లైన్లో అప్లై చేసుకున్న డౌన్లోడ్ చేసుకున్న ఖర్చు అవుతున్న డబ్బులు అధికారుల చుట్టూ తిరిగి విఆర్ఓ కి ఇంత, ఆర్ ఐ కి ఇంత బాస్ లకి ఇంత అంటూ ప్రజల వద్ద నుంచి పీడిస్తున్నారు అని ఆరోపించారు. పైరివి కారులకు అడ్డాగా మారిన రెవెన్యూ కార్యాలయాలు ఎవరుంటే నాకేంటి అని ఇష్టం వచ్చిన రీతిలో దందా నడుపుతున్నారు అని విమర్శించారు. కంప్యూటర్ల వద్ద ఆన్లైన్ చేయాలన్న మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. ఎంతో మంది మీసేవ ల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ,తిరుగుతున్నారని, మాజీ తాజా కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్, ఎవరో ఒకరు ఆ ప్రాంతంలో అధికారులకు అయినా దృవ పరిచేవిధంగా చర్యలు తీసుకోవాలని అవినీతి అక్రమాలను అడ్డాగా మారిన కార్యాలయాలను ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని సలాం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివారెడ్డి, షేక్ సైదా, నిజాంపేట్ యాఖుబ్, జ్వాల నర్సింహారావు, షేక్ చానా, డి శేఖర్ నాయక్, రెడ్డి, మొత్తబోయిన రవి, రాజు, శ్రీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ యోగా దినోత్సవం

- జూన్ 21, 2026

ఖమ్మం , నేటి శుభోదయ :
యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు. ఇది శరీరం, మనసు, మెదడు అన్నింటి పైనా మంచి ప్రభావం చూపే ఒక సంపూర్ణ ఆరోగ్య సాధన. వైద్య పరిశోధనలు చెబుతున్నదేమంటే యోగా వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. యోగా వల్ల మెదడు, నరాల వ్యవస్థ, హార్మోన్లు, కండరాలు, ఎముకలు వ్యవస్థలు బలంగా పని చేస్తాయి. దీంతో మనిషి ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించగలుగుతాడు.ఈ సంవత్సరం యోగా దినోత్సవ థీమ్ "ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగా". దీని అర్థం – యస్సు పెరిగినా ఆరోగ్యంగా, చురుకుగా ఉండటం.

యోగా ఎలా ఉపయోగపడుతుంది?

1. శరీరాన్ని రక్షిస్తుంది
యోగా వల్ల శరీరంలో హానికర పదార్థాలు తగ్గుతాయి. కణాలు నశించకుండా రక్షణ పొందుతాయి. దీని వల్ల షుగర్, గుండె రోగాలు, వయస్సుతో వచ్చే సమస్యలు తగ్గుతాయి.

2. మెదడు పదును పెరుగుతుంది
యోగా చేస్తే జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. వయస్సుతో మెదడు బలహీనమవడం నెమ్మదిస్తుంది. లోతైన శ్వాస వల్ల: మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఒత్తిడి తగ్గుతుంది. నిద్ర బాగుంటుంది

3. శరీరం చురుకుగా ఉంటుంది
యోగా వల్ల : కీళ్లు కదలికలు మెరుగవుతాయి, కండరాలు బలంగా ఉంటాయి పడిపోవడం ప్రమాదం తగ్గుతుంది. ఎముకలు బలంగా ఉంటాయి

4. గుండె ఆరోగ్యం మెరుగవుతుంది
యోగా వల్ల రక్తపోటు తగ్గుతుంది. గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. షుగర్ నియంత్రణలో కూడా సహాయపడుతుంది.

వృద్ధులు పాటించాల్సిన జాగ్రత్తలు

వయస్సు పెరిగే కొద్దీ ఎముకలు, కీళ్లు, గుండె కొంచెం సున్నితంగా మారుతాయి. కాబట్టి జాగ్రత్త అవసరం.

1. ఎముకలు బలహీనంగా ఉన్నవారు
ఎక్కువగా ముందుకు వంగే ఆసనాలు చేయకూడదు, వెన్నెముక నేరుగా ఉంచాలి, నెమ్మదిగా, సులభమైన కదలికలు చేయాలి

2. గుండె / కంటి సమస్యలు ఉన్నవారు
తలకిందులుగా చేసే ఆసనాలు చేయకూడదు, ఒక్కసారిగా లేచే కదలికలు చేయకూడదు, నెమ్మదిగా స్థితి మార్చాలి

3. కీళ్ల నొప్పులు లేదా ఆపరేషన్ చేసినవారు
లోతుగా కూర్చునే ఆసనాలు చేయకూడదు, కుర్చీపై యోగా చేయడం మంచిది, మోకాళ్లపై ఒత్తిడి తగ్గించాలి4. శ్వాస వ్యాయామాలువేగంగా శ్వాస తీసుకునే వ్యాయామాలు చేయకూడదు, శ్వాసను ఆపి చేసే వ్యాయామాలు వద్దు, నెమ్మదిగా శ్వాస తీసుకోవడం మంచిది

ముఖ్య సూచనలు

- యోగా మొదలుపెట్టే ముందు డాక్టర్ సలహా తీసుకోవాలి
- షుగర్, బిపి, ఎముకల పరీక్షలు చేయించుకోవాలి.
- తల తిరగడం, నొప్పి ఉంటే ఆపేయాలి

సురక్షిత వాతావరణం

- జారకుండా ఉండే మట్టలు ఉపయోగించాలి, యోగా మ్యాట్, దిండు వంటి సహాయ వస్తువులు వాడాలి, శరీరాన్ని బలవంతం చేయకూడదు
- నెమ్మదిగా, సౌకర్యంగా చేయాలి

ముగింపు

యోగా అనేది వృద్ధాప్యాన్ని ఆపేది కాదు, కానీ వృద్ధాప్యాన్ని ఆరోగ్యంగా మార్చేది. దీని వల్ల శరీరం మాత్రమే కాదు, మనసు కూడా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది.

డా. సుధీంద్ర
కన్సల్టెంట్ లైఫ్ స్టైల్ అండ్ రిహాబిలిటేషన్
కిమ్స్ హాస్పిటల్స్, సికింద్రాబాద్.

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం

— ఎన్నికల జాబితాల సవరణపై బీఎల్‌వోలకు అవగాహన

నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (SIR)–2026 శిక్షణ కార్యక్రమంలో భాగంగా సిరికొండలో బూత్ లెవల్ ఆఫీసర్లు బూత్ లెవల్ ఏజెంట్లు మరియు సంబంధిత సిబ్బందికి ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల ఓటరు జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, మరణించిన మరియు డూప్లికేట్ ఓటర్ల తొలగింపు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం సాధించేందుకు బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పని చేయాలని అధికారులు సూచించారు.శిక్షణలో ఓటరు జాబితాల సవీకరణకు సంబంధించిన నిబంధనలు, సాంకేతిక విధానాలు, ఫీల్డ్ స్థాయి పరిశీలన పద్ధతులపై వివరంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన ఎన్నికల సేవలు అందించేందుకు ఈ శిక్షణలు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరికొండ తహసీల్దార్ రవీందర్ రావు పాల్గొని శిక్షణను పర్యవేక్షించారు. ఎన్నికల జాబితాల సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు సూచించారు.కార్యక్రమంలో ఎన్నికల శాఖ సిబ్బంది, బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

త్రివేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ఖమ్మం, నేటి శుభోదయ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "యోగ" భారతదేశం ప్రపంచానికి అందించిన ఒక గొప్ప వరం అని,యోగ ద్వారా ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజు జూన్ 21 కావటం వలన,ఈ ప్రత్యేకతని పురస్కరించుకుని ఈ రోజుని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని 2014, సెప్టెంబర్ 27న మన ప్రధాని నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి కి సూచించగా, 193 ప్రతినిధులు ఉన్న ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యులుగా ఉన్న దేశాలతో సహా 175 మంది 2014 లో ఆమోదించారు. మొదటి యోగ అంతర్జాతీయ దినోత్సవం 2015, జూన్ 21న జరుపుకున్నారని తెలియజేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని, ప్రతి ఒక్కరూ యోగా ని నిత్యజీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ చైతన్య కిషోర్ పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయుల తో వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ప్రదర్శనలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై పాఠశాల యాజమాన్యం అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్,ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

మాదాయిపల్లి గేటు దగ్గర గుంత..!

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు!

- సంవత్సరాలు గడుస్తున్న అభివృద్ధి నోచుకోని మాదాయి పల్లి గేట్ రోడ్డు

తలకొండపల్లి, నేటి శుభోదయ : మాదాయిపల్లి గేటు దగ్గర రోడ్డు గుంత, కంకరతో నిండి స్థానికులు వాహన దారులు, నానా ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పట్టించుకోని,అధికారులు ప్రజా ప్రతినిధులు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం మాదాయిపల్లి గ్రామానికి వెళ్లాల్సి న రోడ్డు, అద్వానమైన రోడ్లపై ప్రయాణిస్తున్న అధికారులు ప్రజా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు, దీనికి తోడు కామన్ దగ్గర భారీ గుంత ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది వర్షాకాలం కావడంతో ఆ గుంత మరింత పెద్దదై ప్రయాణికులకు ప్రమాదం జరిగా అవకాశం ఉంది. గతంలోనే ఈ రోడ్డుపై

వాహనాలు ప్రమాదం భారిన పడడం జరిగింది. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి, ఈ రోడ్డుపై బీటీ వెయ్యాలని,ప్రయాణికులు వాహనాలు దారు లు కోరుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో సంవత్సరాలు గడుస్తున్న ఈ రోడ్డు అభివృద్ధిలో చుకోవడం లేదని,మాదాయిపల్లి,చౌదర్పల్లి, వెల్జాల్ గ్రామ ప్రజలు, వాహనం దారులు తీవ్రంగా మండిపడుతున్నారు.

రైతుల పక్షాన నిరంతర పోరాటమే నా ధ్యేయం - మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

- 17వ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా రైతుల సమస్యలపై గళమెత్తాను : మాజీ ఎంపీ నామ

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఖమ్మం, నేటి శుభోదయ :
రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా రైతుల సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎన్నోసార్లు ప్రస్తావించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైతాంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, విస్తృత స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలియజేశారు. వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థ కువెన్నెముక అని, రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పంట కొనుగోలు సమస్యలు, గిట్టుబాటు ధరలు, సాగునీటి ఇబ్బందులు, ఎరువులు, విత్తనాల కొరత, విద్యుత్ సమస్యలు వంటి అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకొచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సాయం జమ చేసి, రైతు కుటుంబాలకు భరోసా కల్పించి, తెలంగాణను వ్యవసాయ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపిందన్నారు. ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుకు అండగా నిలవాలనే విధానాన్ని నాడు కేసీఆర్ ప్రభుత్వం విజయవంతంగా

అమలు చేసిందని తెలిపారు.ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించిన కోటాకు పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే రైతు సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటుందని, రైతు సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, అన్నదాతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేసారు.

రేపటి నుంచి ఎప్ సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ

శామీర్ పేట, నేటి శుభోదయ : 2026-27 ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాలకు సంబంధించిన మొదటి విడత కౌన్సిలింగ్ సోమవారం నుంచి ఈనెల 29 వరకు కొనసాగుతుందని ఎస్ ఆర్ బి జి ఎస్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ధ్రువ పత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు తాము నమోదు చేసుకున్న విధంగా స్లాట్స్ సమయానుసారం హాజరు కావాలని సూచించారు.ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు.స్లాట్ బుకింగ్ ఫాం,హాల్ టికెట్, ర్యాంకు కార్డ్,ఎస్.ఎస్.సి మెమో, ఇంటర్ మార్కుల జాబితా,ఇంటర్ టీ.సి,నాల్గవ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్,క్యాస్ట్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ 2026-27, ఆదాయ ధ్రువీకరణ 2026,ఆధార్ తదితర సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు.దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సమయ పాలన పాటిస్తూ కౌన్సిలింగ్ ప్రక్రియ కు హాజరు కావాలని సూచించారు.

దైనందిన జీవితంలో యోగ సాధన ఎంతో అవసరం

- గ్యాస్ట్రో ఏంట్రాలజిస్టు డాక్టర్ జంగాల సునీల్ కుమార్

ఖమ్మం, నేటి శుభోదయ : మన దైనందిన జీవితంలో యోగ సాధన ఎంతో అవసరమని ఖమ్మం నగరానికి చెందిన గ్యాస్ట్రో ఏంట్రాలజిస్టు డాక్టర్ జంగాల సునీల్ కుమార్ అన్నారు.శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ పురస్కరణలో భాగంగా ముందస్తుగా ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమాట్ల అటవీ పార్కులో 150 మంది యోగా సాధకులతో ఉత్సాహ భరితంగా యోగదినోత్సవం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్. బాలరాజు,డాక్టర్ జంగాల సునీల్ కుమార్ లు వచ్చారు. ఈసందర్భంగా వారు యోగదినోత్సవం ను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్ లో మనం ఎటువంటి రుగ్మతలకు లోనవ్వకుండా మనల్ని మనం కాపాడుకునే మంచి ఆయుధంగా యోగాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఘాట్ హెల్త్ కు సంబంధించి న అనేక విషయాలపై అవగాహన కల్పించారు. ఆహార అలవాట్లలో తెల్లటి బియ్యం,ఆయిల్ ప్యాకేట్స్,ఉప్పు మూడు పదార్థాలు తక్కువ వాడటం వల్ల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడుకోవచ్చని సూచించారు.అనంతరం జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లీవర్ ఫౌండేషన్ ద్వారా జరిగేటువంటి అనేక సేవా కార్యక్రమాలను ప్రజలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్ కోదండరాం,కృష్ణ మూర్తి,శ్యామ్,రమేష్, వరలక్ష్మి , జయ అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర త్రిబుల్ ఐటీ లో సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని.. గోగు కార్తీక

నిజామాబాద్ రూరల్, నేటి శుభోదయ : పిఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో పదవ తరగతి విద్యార్థిని గోగు కార్తీక ప్రతిష్టాత్మక త్రిబుల్ ఐటీ కి ఎంపిక కావడం అభినందనీయమని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గడ్డం రాజేష్ రెడ్డి తెలిపారు. ఆసాధారణ ప్రతిభ కనపరిచి గోగు కార్తీక ప్రతిభకు గుర్తింపుగా రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ మహబూబ్

నగర్ లో ప్రవేశానికి ఎంపిక కావడం జరిగిందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో పదవ తరగతి గోగు కార్తీక చదువుకొందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ కష్టపడి త్రిబుల్ ఐటీ సీట్ సాధించడం పి.ఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల కు, సిరికొండ మండలానికి గర్వకారణంగా నిలిచిందని ప్రిన్సిపల్ గడ్డం రాజేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. త్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన గోగు కార్తీక కు ఉపాధ్యాయ బృందం తోటి విద్యార్థులు కొండూరు గ్రామస్తులు ఘనంగా అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను గోగు కార్తీక అధిరోహించాలని వారు ఆకాంక్షించారు, మొత్తం 7 గురు విద్యార్థులు ఈ సంవత్సరం IIIT కి ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు

బుగ్గవీటి కోటేశ్వరరావు దశదిన కర్మకు హాజరైన పలువురు ప్రముఖులు

ఖమ్మం, నేటి శుభోదయ : టీడీపీ ఖమ్మం పార్లమెంట్ పార్టీ కన్వీనర్, టీటీడీపీ నేత డాక్టర్ వాసిరెడ్డి రామనాథం వియ్యంకుడు, రిటైర్డ్ ఇంజనీరు బుగ్గవీటి కోటేశ్వరరావు దశదిన కర్మ కార్యక్రమం శనివారం ఖమ్మం నగరంలో గల గొరిల్లా ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తో కలసి కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలానే మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, రాయల నాగేశ్వరరావు, నల్లమల వేంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వరరావు, కనకమేడల సత్యనారాయణ, కేతినేని హరీష్, వనమా వాసు, కనగాల సాంబశివరావు, కొండబాల కరుణాకర్, పాలడుగు కృష్ణప్రసాద్, సీతయ్య, విజయ్, మల్లాది హనుమంతురావు, రాంబాబు సహ పలువురు ప్రముఖులు హాజరై నివాళ్లు అర్పించారు. అలానే వారి కుటుంబ సభ్యులు బుగ్గవీటి శ్రీధర్, డా. బుగ్గవీటి సమత, బుగ్గవీటి గౌతమ్, అఖిల లతో కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు మాట్లాడి పరామర్శించారు.

ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతోనే
రిటైర్డ్ సంఘ భవనంకు స్థలం కేటాయించిండ్రు

సదాశివపేట, నేటి శుభోదయ : పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంగం భవన నిర్మాణం కోసం సర్వేనెంబర్ 108 కందకం గల 250 గజాలు స్థలము వాటర్ ట్యాంక్ దుర్గమ్మ మందిర్ దగ్గర గల స్థలాన్ని 2005 సంవత్సరంలో అప్పటి ఎంపీ ఆలే సరేంద్ర ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డిలా ఆధ్వర్యంలో స్థలము కేటాయించి భూమి పూజ చేయడం జరిగిందని. సదాశివపేట రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మల్లేశం తెలిపారు. శనివారం సంఘ భవనంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. గత 20 సంవత్సరాల నుండి అట్టి స్థలంలో పంద్రాగస్టు. 26 జనవరి సందర్భంగా జెండాలు ఎగరవేయడం జరిగిందని అనివార కారణాలవల్ల భావన నిర్మాణం చేయలేక పోయామని. ప్రస్తుతం అట్టిస్థలాన్ని గుర్తుతెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. కావున సంబంధిత అధికారులు చొరవ తీసుకొని

మాకు కేటాయించిన స్థలానికి రక్షణ కల్పించాలని పత్రిక విలేకరుల సమావేశం ద్వారా తెలపడం జరుగుతుంది. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్కు మరియు మున్సిపల్ కమిషనర్ కు. స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకుపోయి వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఇట్టి స్థలం లో భవనం నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ విలేకరులతో సమావేశంలో రిటైర్డ్ సంఘం పూర్వ అధ్యక్షులు బోడపల్లి శంకరప్ప. జిల్లా కౌన్సిల్ సభ్యులు అంబటి విశ్వనాథం. కార్యదర్శి తుక్కుడేదాస్ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మనసుకు ప్రశాంతత, శరీరానికి శక్తి
'యోగా'నే జీవితానికి స్ఫూర్తి

ఖమ్మం, నేటి శుభోదయ : స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ముందస్తు సంబరాలను శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం లను నిర్వహించి హుషారుగా గడిపారు. విద్యార్థులు పలు రకాల యోగాసన భంగిమలను వేసి, 12 రకాల సూర్య నమస్కారాలను ప్రదర్శించారు. యోగా గురువు సూచనల మేరకు ధ్యానం ను నిష్టగా నిర్వహించారు. వివిధ రకాల యోగాసన భంగిమలతో పాఠశాల మైదానం కనువిందు చేసింది.ఈ సందర్భంగా యోగాసనాలలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచానికి మన భారతదేశం ఇచ్చిన గొప్పకానుక యోగ అని తెలిపారు. యోగాసనాలు ప్రతి ఒక్కరిని నిత్యం ఉత్తేజకరంగా ఉంచుతుంది అని తెలిపారు. మానసిక, శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ధ్యానం ఉపయోగపడతాయని తెలియజేశారు. అనంతరం పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరికి తండ్రి గొప్ప హీరో అని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా విద్యార్థులందరికీ ఫాదర్స్ డే గ్రీటింగ్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్–రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి - కలెక్టర్ అంకిత్

● సర్పంచ్ చిగుర్లపల్లి శ్రీకాంత్ గౌడ్

దమ్మపేట, నేటి శుభోదయ : జిల్లాలో ఫారెస్ట్–రెవెన్యూ జాయింట్ సర్వే,నాన్–క్యాడస్ట్రల్ సర్వే,నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్–క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్–రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు.అటవీ రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి,భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు.శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్–రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు.దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్మెంట్ను మ్యాప్ ద్వారా పరిశీలించి,ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ,సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఫారెస్ట్–రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు,దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు,సర్వేయర్ నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చేయూత నిచ్చిన హెల్పింగ్ హాండ్స్ సభ్యులు
సాదినేని భాస్కరరావు, అన్నపూర్ణమ్మ దంపతులు

ఖమ్మం, వైరా, నేటి శుభోదయ : వైరా మున్సిపాలిటీ ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాల గోడలకు పెయింట్స్ వేయించడం కోసం హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఖమ్మం వారు సాదినేని భాస్కరరావు, అన్నపూర్ణమ్మ దంపతులు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖా ధికారి చావా శ్రీనివాసరావు, యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నరసింహ రావుకు అందించారు.ఈ సందర్భంగా పిఆర్పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధి కోసం ఆవాస ప్రాంతంలోని పెద్దల సహకారంతో పదిమంది నూతన విద్యార్థుల అడ్మిషన్లు చేసిన పాఠశాల ఉపాధ్యాయులు అభినందనీయులని తెలిపారు. అదేవిధంగా పాఠశాల గోడలకు పెయింట్స్ నిమిత్తం ఆర్థిక సహకారం అందించిన సాదినేని భాస్కరరావు అన్నపూర్ణమ్మ దంపతుల దాతృత్వం గొప్ప అభినందనీయమని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలలకు మౌలిక వసతులకు సమకూర్చటంలో యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) అభినంద నీయులని రిటైర్ అయినా సరే ఉపాధ్యాయుల కోసం పాఠశాల కోసం అనునిత్యం కష్టపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నరసింహారావు, ఉపాధ్యాయులు బిరెల్లి రామకృష్ణ, పిఆర్పిఏ జిల్లా కోకన్వీనర్ కొండలరావు, పిఆర్టియు వైరా మండల మాజీ అధ్యక్షులు కొత్తా శ్రీనివాసరావు, పిఆర్టియు సీనియర్ బాధ్యులు చంద్రశేఖర్ రెడ్డి, మద్దినేని పాపారావు, తల్లాడ మండల పిఆర్టియు అధ్యక్షులు అద్దంకి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి గద్దల సిరిని సన్మానించిన సర్పంచ్
- శ్రీమతి సులోచన దావీదు

బోనకల్ , నేటి శుభోదయ : జానకిపురం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో బాగంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి సులోచనదావీదు,పంచాయతీ కార్యదర్శి శ్రీ శ్రీనివాస్ వార్డు సభ్యుల తో గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభ అనంతరం టేబుల్ టెన్నిస్ క్రీడలలో పాల్గొంటున్న ఇదే గ్రామానికి చెందిన గద్దల సిరిని సన్మానించారు.క్రీడాకారిణి సిరిని ఉద్దేచించి శ్రీమతి కర్లకుంట సులోచనదావీదు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సి.యం కప్ క్రీడా పోటిలలో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించిందని సర్పంచ్ అన్నారు.రిటైర్డ్ ASI శ్రీ కర్లకుంట దావీదు మాట్లాడుతూ సిరి క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయి గోల్డ్ మెడల్స్ తో పాటు ఇంకా అనేక పథకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యి తెలంగాణ రాష్ట్రం నుండి అండర్ – 17 బాలికల విభాగంలో కేరళ,తమిళనాడు రాష్ట్రల వేదిక గా జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలలో పాల్గొని తన ప్రతిభ ను కనబరిచిందని తెలిపారు.జానకీపురం గ్రామం నుండి జాతీయ స్థాయిలో ఆడుచున్నందుకు తన ఆనందాన్ని వ్యక్త పరుస్తూ క్రీడాకారిణి సిరిని మోమెంట్ తో పాటు శాలువా కప్పి తన బహుమతిగా ఐదు వేల రూపాయలు నగదును ఇచ్చి సత్కరించారు.అంతేకాకుండా క్రీడా రంగంలో రాణించి జానకీపురం గ్రామం నుండి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడల యందు జాతీయ స్థాయి లో రాణిస్తున్న సిరిని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.చిన్న వయసులోనే టేబుల్ టెన్నిస్ క్రీడల్లో రాణించి చక్కటి ప్రతిభను కనబరుస్తున్న సిరిని గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ శ్రీ భూపతిరావు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు అభినందించారు.టేబుల్ టెన్నిస్ క్రీడలో రాణించడానికి ఖమ్మం ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇస్తున్న కోచ్ శ్రీ ఓలేటి సాంబమూర్తి కఠోరమైన క్రీడా శిక్షణ,క్రమశిక్షణ సూచనలు,సలహాల వల్లే ఈ స్థాయి కి వెళ్లగలిగిందని సిరి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బడి బయట విద్యార్థిని పాఠశాలలో చేర్పించిన ఎంఈఓ శంకర్

సంగారెడ్డి ప్రతినిధి, నేటి శుభోదయ : బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం సదాశివపేట మండలంలోని బడి బయట ఉన్న క్రాంతి కృష్ణ అనే విద్యార్థిని సదాశివపేట మండల విద్యాధికారి శంకర్ మరియు మాజీ మండల విద్యాధికారి అంజయ్య కలసి ప్రభుత్వ రవీంద్ర మాడల్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదొవ తరగతిలో చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ సదాశివపేట మండలంలో బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని సూచించారు. బడి బయట విద్యార్థులు ఎక్కడైనా ఉన్నచో తమ కార్యాలయానికి సమాచారం అందించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా సమితి నిర్వాహకులు వీర శైవ సమాజం అధ్యక్షులు, బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్ లో రూ.1.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన - ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, నేటి శుభోదయ :

రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్-11 పరిధిలోని అత్తాపూర్ (సి-20) డివిజన్లలో రూ.1.45 కోట్ల,రూ.145.55 లక్షలు) అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు సీసీ రోడ్ల నిర్మాణం,డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలను ఆయన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..నియోజకవర్గంలోని ప్రతి గల్లీని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని,ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.శంకుస్థాపన చేసిన పనుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.హైదర్‌గూడ డివిజన్ -113 పరిధిలోని పనులు మొత్తం వ్యయం రూ.68.45 లక్షలు,సీసీ రోడ్డు నిర్మాణం రూ.19.85 లక్షలు,వార్డు-60 వెంకటేశ్వర ఎన్క్లేవ్,చైతన్య విలాస్ కాలనీ,ఉప్పరపల్లి పరిధిలో హెచ్.నెం.2-1-35 నుండి 2-1-7/2/118 (పిఎన్ఆర్ రెసిడెన్సీ సమీపంలో) వరకు సీసీ రోడ్డు నిర్మాణం.సీసీ ప్యాచ్ వర్క్స్ రూ.29.10 లక్షలు,వార్డు-61 పరిధిలోని జనప్రియ యుటోపియా నుండి గాంధీ విగ్రహం మీదుగా రాధాకృష్ణనగర్ (హెచ్.నెం.3-4-173/3) సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు రోడ్డు ప్యాచ్ పనులు.సీసీ రోడ్డు నిర్మాణం రూ.19.50 లక్షలు, హైదర్‌గూడ విలేజ్ పరిధిలోని పిల్లర్ నెం.135 నుండి ఈశ్వర్ థియేటర్ మీదుగా హెచ్.నెం.6-4-173/3 వరకు సీసీ రోడ్డు నిర్మాణం.అత్తాపూర్ డివిజన్ 112 పరిధిలోని పనులు మొత్తం వ్యయం రూ.77.10 లక్షలు,సీసీ రోడ్డు నిర్మాణం రూ.18.55 లక్షలు, వార్డు-61 అత్తాపూర్ పాత గ్రామం (ఓల్డ్ విలేజ్)లో హెచ్.నెం.4-3-26 నుండి 4-2-148/2 వరకు సీసీ రోడ్డు నిర్మాణం.సీసీ రోడ్డు నిర్మాణం రూ.19.85 లక్షలు,అత్తాపూర్ డివిజన్ వార్డు-61 తేజస్విని కాలనీలోని కేటీఆర్ స్విమ్మింగ్ పూల్ సమీపంలో,ఎమోరి హాస్పిటల్ వెనుక భాగంలో సీసీ రోడ్డు నిర్మాణం.స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు రూ.38.70 లక్షలు,వార్డు-61 పాండురంగనగర్,ఉమా నిలయం పరిధిలో హెచ్.నెం.4-7-154/3/118 నుండి హెచ్.నెం.4-7-154/3/116/1 మరియు 4-7-154/3/A/B/3 వరకు 600ఎంఎం డయా ఆర్ సి సి పైప్‌లైన్,రోడ్డు పునరుద్ధరణ పనులు,మంజూరైన ఈ పనులన్నింటినీ ఏజెన్సీల (కాంట్రాక్టర్ల) ద్వారా నాణ్యతా ప్రమాణాలతో,నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు,కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,జీహెచ్ఎంసీ అధికారులు,కాలనీల అసోసియేషన్ సభ్యులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

కేశంపేట, నేటి శుభోదయ :

కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి చెందిన కావలి శాంతయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కొత్తపేట మాజీ పీఏసీఎస్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్ గౌడ్ రూ.5000, గ్రామ సర్పంచ్ బుడ్డోల్ల రాజు రూ. 1000,తెలంగాణ రాజు రూ. 1,000 ,చీమల శ్రీనివాసులు రూ.500, టేకుల కోటేశ్వర్ రూ.500, కావలి పెద్ద నరసింహ రూ.500, కావలి నరసింహ రూ.500 చొప్పున విరాళాలు అందించారు.మొత్తం రూ.10,000లను బీఆర్ఎస్ పార్టీ తరఫున గ్రామ సర్పంచ్ బుడ్డోల్ల రాజు, మాజీ సర్పంచ్ గండ్ర లక్ష్మమ్మ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా - అభివృద్ధికి క్రీడలు

- గ్రామ సర్పంచ్ శశిరేఖ

కేశంపేట, నేటి శుభోదయ : కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామం శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం మరియు స్పోర్ట్స్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థులందరితో యోగా సాధన చేయించి, యోగా వల్ల కలిగే శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత వంటి ప్రయోజనాలను ఉపాధ్యాయులు వివరించారు. అలాగే యోగా ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించారు.అనంతరం స్పోర్ట్స్ డే సందర్భంగా 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెలు, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పాఠశాల యాజమాన్యం

తెలిపింది.కార్యక్రమం అనంతరం మధ్యాహ్న భోజన పథకం, క్రీడా సామగ్రి, పాఠ్యపుస్తకాల అందుబాటు తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శశిరేఖ, ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ఉపాధ్యాయ బృందం, వార్డు సభ్యులు పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

యూరియా కోసం రైతుల అవస్థలు..

- యాప్ గందరగోళంతో సిరికొండలో పడిగాపులు

సిరికొండ, నేటి శుభోదయ :

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరికొండ మండల కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రం వద్ద రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో యూరియా పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నట్లు రైతులు వాపోతున్నారు.మండుటెండలో క్యూలలో నిలబడుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల సాగుకు అత్యవసరమైన సమయంలో యూరియా అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాప్ కారణంగా పంపిణీ ఆలస్యం కావడం, సర్వర్ సమస్యలు తరచూ ఎదురవడం వల్ల రైతులు పలుమార్లు కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరి యానుసులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే యాప్ విధానాన్ని సరళీకృతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి యూరియా కొరత లేకుండా పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

గాంధీ భవన్ సత్యాగ్రహ దీక్షకు కేశంపేట కాంగ్రెస్ నాయకుల సంఘీభావం

కేశంపేట, నేటి న్యూస్ : తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ గారి రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను నిరసిస్తూ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షకు కేశంపేట మండల కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి పిలుపు మేరకు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఓటు హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, దానిని బలహీనపరిచే ఎలాంటి ప్రయత్నాలనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రాజ్యాంగ బద్ధ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.“ఓటు చోరీ అంటే ప్రజల తీర్పును చోరీ చేసినట్టే, సీటు చోరీ అంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించినట్టే. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుంది” అని నాయకులు

పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లూరి జగదీశ్వర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, మల్లేష్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

ఖమ్మం, నేటి శుభోదయ : రెజొనెన్స్ పాఠశాలలో ఇంటర్నేషనల్ యోగా డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠశాల డైరక్టర్ నీలిమ మాట్లాడుతూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ ఏ విధంగా మెరుగు పరుచుకోవచ్చో విపులంగా వివరించారు. యోగా అనేది 5000 సంవత్సరాల నుండి భారత దేశంలో ఉన్న జ్ఞానము యొక్క అంతర్భాగం. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామం కేవలం కొన్ని శారీరిక కదలికలు(ఆసనాలు) ఇంకా శ్వాసప్రక్రియ అని మాత్రమే అనుకుంటారు. కానీ నిజానికి మానవుని యొక్క అనంతమైన మేధాశక్తి, ఆత్మశక్తి కలయిక. విజ్ఞానశాస్త్ర ప్రకారము యోగా అంటే పరిపూర్ణ జీవనసార విధానం అని విద్యార్థులకు యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపక సిబ్బంది విద్యార్థులతో యోగా అసనాలు ఎలా వేయాలో వివరంగా తెలిపి వారిచేత ఆసనాలు వేయించారు.పాఠశాల డైరక్టర్ ఆర్.వి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా, మంచి ఆహారపు అలవాట్లను పాటించటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం జీవిస్తూ ఉన్నత స్థాయిని అదిరోహించవచ్చని యోగాసనాలు శరీరానికి ధృఢత్వాన్ని,శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారెన, చిన్నవారైన ఆసనాలు వేయటానికి ఇష్టపడతారు.సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనుకాల ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుందని విద్యార్థులకు వివరించారు.పాఠశాల డైరెక్టర్ కె. శ్రీధర్ రావు మాట్లాడుతూ అనతి కాలంలోనే యోగాని ప్రపంచమంతా గుర్తించి సంవత్సరంలో ఒక రోజును కేటాయించటం చాలా సంతోషం. ప్రతిరోజూ యోగా చేయటం వలన, పిల్లలు, పెద్దలు అందరు ఆరోగ్యవంతమైన జీవితం జీవిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవానికి అంత్యక్రియలు నిర్వహించిన అన్నం శ్రీనివాసరావు

ఖమ్మం, నేటి శుభోదయ : ఖమ్మం జిఆర్పి పోలీస్ పరిధిలోని బోనకల్ మోటమర్రి రైల్వేస్టేషన్లో మధ్యలో 30 సంవత్సరాల గుర్తుతెలియని యువకుడు ఈ నెల 17న రైలు నుండి జారిపడి మృతి చెందాడు. ఈ మృతదేహాన్ని రైల్వే పోలీస్ వారు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చిరికి తరలించి భద్రపరిచారు. ఇప్పటివరకు మృతుడి కొరకు ఎవరూ రానందున అనాధ శవంగా భావించిన రైల్వే పోలీస్ వారు మృతదేహాన్ని దహన సంస్కారం చేయమని లిఖిత పూర్వకం గా పత్రం అన్నం ఫౌండేషన్ కి ఇచ్చారు . అన్నం ఫౌండేషన్ మార్చురీ వద్దకు చేరుకొని రైల్వే పోలీస్ వారు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని తెల్ల వస్త్రంలో చుట్టి పూలు పూలదండలతో గౌరవించి బల్లేపల్లి వైకుంఠ దామానికి తరలించి దాన సంస్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవయ్యనగర్ భూ వివాదంపై
నిష్పక్షపాత విచారణ జరపాలి
- ఎన్ఎస్పికి భూములు ఇచ్చిన రైతులు, రాఘవయ్య నగర్ నివాసులు

ఖమ్మం, నేటి శుభోదయ :
ఖమ్మం నగరంలోని రాఘవయ్యనగర్ అష్టలక్ష్మి టెంపుల్ వద్ద కొనసాగుతున్న భూ వివాదానికి సంబంధించి అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని నిష్పక్షపాతంగా విచారణ జరపాలని స్థానికులు కోరారు. తాము ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని, దశాబ్దాలుగా చట్టబద్ధ పత్రాలతోనే భూములను కలిగి ఉన్నామని వారు పేర్కొన్నారు. బాధితుల వివరాల ప్రకారం, తమ కుటుంబ సభ్యులు సుమారు 48. సంవత్సరాల క్రితం పాకబండ పరిధిలోని సర్వే నంబర్లు 84, 85లో వ్యవసాయ భూములను చట్టబద్ధంగా కొనుగోలు చేశారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం ఆ భూముల్లో కొంత భాగాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. అప్పటి నుంచి ప్రభుత్వ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ శాఖ ధ్రువపత్రాలు, ఎల్ఆర్ఎస్ పత్రాలు, సర్వే నివేదికలు తమ హక్కులను నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. మమత కళాశాలకు వెళ్లే మార్గం సమీపంలో ఉన్న మేజర్ -2 ప్రధాన కాలువ నుంచి చీలిన 2-ఎల్ మైనర్ గా ఉన్న కాలువ పక్కనున్న చట్టబద్ధంగా ఎలాంటి ఆక్రమణ లేనప్పటికీ మా తొమ్మిది మంది ప్లాట్ల విషయంలోనే వివాదం సృష్టిస్తున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణ సమయంలో కనీసం రెవెన్యూ అధికారుల సమక్షం లేకుండానే కొందరు తమ స్థలాల్లోకి ప్రవేటు సైన్యంలా ప్రవేశించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తమ హక్కులను కాపాడుకునేందుకు కోర్టును ఆశ్రయించగా స్టే ఉత్తర్వులు సైతం లభించాయని తెలిపారు. అయినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగాయని ఈ వ్యవహారాల్లో ఎఫ్ఐఆర్లు కూడా నమోదయ్యాయని పేర్కొన్నారు.ప్రారంభం నుంచి 2-ఎల్ మైనర్ గా ఉన్న కెనాల్ ను 45.ఏళ్ల తర్వాత ఇప్పుడు మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పాకబండ టిపేన్లు మాయం చేశారని కొందరు రికార్డులను తారుమారు చేశారనే అనుమానాలు ఉన్నాయని, కొన్ని కీలక రెవెన్యూ రికార్డులు అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.తమ వద్ద ఉన్న 45.ఏళ్ల నుంచి చట్టబద్ధ డాక్యుమెంట్లు, కోర్టులకు సమర్పించిన సర్వే అఫిడవిట్లు, రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖల నివేదికలు ఆక్రమణలు లేవని స్పష్టం చేస్తున్నప్పటికీ తమను కబ్జాదారులుగా చిత్రీకరిస్తూ ప్రచారం చేయడం బాధాకరమన్నారు. గత ఇరవై రోజులుగా తమపై వరుసగా ఆరోపణలు చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది కిలోమీటర్ల పొడవున కొనసాగుతున్న కాలువ పరిధిలో కేవలం 250 మీటర్ల ప్రాంతానికే వివాదాన్ని పరిమితం చేయడం వెనుక కారణాలు ఏమిటో పరిశీలించాలని కోరారు. ముఖ్యంగా తమ వద్ద స్థలాలు కొనుగోలు చేసిన కొద్ది మంది ప్లాట్ల విషయంలోనే వివాదం సృష్టించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అదే ప్రాంతంలో గ్రీన్ బెల్ట్ భూములు, లైవ్ కెనాల్, అబాండెడ్ కెనాల్ ప్రాంతాలు ఉన్నప్పటికీ వదిలేసి ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాలేదని నిర్ధారణ పత్రాలు చూపిస్తున్నా ఇక్కడే వివాదం సృష్టిస్తున్నారు. తమ డాక్యుమెంట్ల ప్రకారం మరియు ప్రభుత్వం ఇచ్చిన అధీకృత ఎన్ ఓసి లను మించి తమకు చెందని భూమిని తాము కోరడం లేదని, ఎవరి ప్లాట్లోనైనా రికార్డులకు మించి అదనపు స్థలం ఉన్నట్లు నిరూపితమైతే చట్టప్రకారం అధికారులు తీసుకునే చర్యలకు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంలో అన్ని వర్గాల వాదనలు, అధికారిక రికార్డులు, కోర్టు తీర్పులను పరిశీలించి పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రైతుల నుంచి సేకరించిన స్థలం ఉపయోగనంతరం అదే రైతులకి ఇవ్వాలనే అవకాశం ఉన్నప్పటికీ ఒక్క గజం ప్రభుత్వం నుంచి పొందలేదని తెలిపారు. రాఘవయ్యనగర్కు చెందిన కర్నాటి నాగమణి,వల్లూరి పద్మావతి, కర్నాటి లలితా శ్రీ, మూలగుండ్ల వేణు, మూలగుండ్ల కిరణ్, నంబూరి శ్రీహరి, పారుపల్లి రామలింగేశ్వరరావు, కర్నాటి ప్రసాద్,పెంటేల సాగర్, పరుచూరు సుబ్బారావు తదితరులు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

మల్లెల మడుగు డబుల్ బెడ్రూం నివాస ప్రజలకు
ఉచిత కంటి వైద్య శిబిరం

ఖమ్మం, నేటి శుభోదయ : ఖమ్మం జిల్లా మల్లెల మడుగు డబుల్ బెడ్రూం కాలనీలో నివాస ముంటున్న ప్రజల కోసం శరత్ ఆక్సిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య శిబిరాన్ని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సభ్యులు మల్లెల మడుగు డబుల్ బెడ్రూం ప్రెసిడెంట్ బోడా వీరన్న, హాస్పిటల్ సిబ్బంది బి. విక్రం సింగ్, లెనిన్, అనీల్ ప్రారంబించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.శిబిరానికి కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. కాలనీ ప్రజలు శిబిరం నిర్వహించిన నిర్వాహకులకు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ యాకుబ్, రవి రెడ్డి, నరేష్, ఎల్లమ్మ , నాగమణి, వాణి తదితరులు పాల్గొన్నారు.

వైరా మున్సిపాలిటీ అభివృద్ధి ఎల్లప్పుడు సహకరిస్తాం
- బిఆర్ఎస్ పార్టీ వార్డు కౌన్సిలర్లు

వైరా, నేటి శుభోదయ : వైరా మున్సిపాలిటీ అవినీతి రహిత అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ వార్డు కౌన్సిలర్లు కచ్చితంగా సహకరిస్తామని వారు స్పష్టం చేశారు .శనివారం విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి, తిరుపతి శివకుమారి, చిలక చిన్నకోటయ్య, దొంతుబోయిన వెంకటేశ్వరరావు, కిన్నెర కృష్ణ, నల్లమోతు శైలజ, మాదినేని సునీత పాల్గొని మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాలు మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందుంటామని, వివక్షత చూపకుండా మున్సిపాలిటీ అభివృద్ధిలో అన్ని వార్డులకు సముచిత స్థానం కేటాయించాలని కోరారు. వైరా మున్సిపాలిటీలో అధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 95 అంశాలను కూడిన ప్రతిపాదనలను ప్రవేశ పెట్టడం వల్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రవేశపెట్టిన పలు అంశాలను సవరించాలని వారు అధికారులను కోరారు . చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ భర్త డాక్టర్ కాపా మురళీకృష్ణ బి ఆర్ ఎస్ వార్డు కౌన్సిల్ సభ్యుల పట్ల మాట్లాడే విధానం సరిగా లేదని వారన్నారు. కౌన్సిల్ సమావేశాలకు బయట వ్యక్తులను అనుమతించకూడదని పేర్కొన్నారు. పత్రికా విలేకరులకు మున్సిపల్ కార్యాలయంలో మీడియా పాయింట్ ఏర్పాటు చేయాలని అధికారులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు సురేష్, పట్టణ మాజీ అధ్యక్షులు మద్దెల రవి, జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జున రావు, స్థానిక నాయకులు కారుకొండ బోసు, నూకల శ్రీనివాసరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, నల్లమోతు సురేష్, కట్టా నాగేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, ఏదునూరి శ్రీనివాసరావు, తిరుపతి శ్రీనివాసరావు, మరికంటి శివ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుంజా వనజ మృతిపై డాక్టర్ రవీందర్ నాయక్
డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆరా

భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్ డా. రవీందర్ నాయక్ జిల్లాకు విచ్చేసి కుంజా వనజ మృతి సంఘటనపై సమగ్రంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్, మరియు డాక్టర్ రవిబాబు డిసిహెచ్ఎస్, సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.తదుపరి డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా-శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల(ఎన్ సి డి) స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్ఠు నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు.ప్రతి కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను శాతానికి శాతం సాధించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో రిఫరల్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాతా- శిశు మరణాల నివారణకు ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ తుకారాం రాథోడ్ డీ ఎం హెచ్ ఓ, డాక్టర్ రవిబాబు డీ ఎం హెచ్ ఓ, డాక్టర్ ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ దినేష్ ప్రోగ్రాం ఆఫీసర్, మోహన్, రామ్ ప్రసాద్ , విప్లవ్ కుమార్, సలిత, శ్రీధర్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

సర్ -2026 మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష
సమావేశం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్

ఖమ్మం, నేటి శుభోదయ :
ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ -2026) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిపై ఏఈఆర్ఓ లు, సూపర్వైజర్ అధికారులు, సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఏఈ ఆర్ఓ పరిధిలో ఇప్పటివరకు పూర్తయిన మ్యాపింగ్ శాతం, పెండింగ్లో ఉన్న మ్యాపింగ్ వివరాలు, పనుల పురోగతి మందగించిన ప్రాంతాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి మ్యాపింగ్ నిర్వహిస్తున్నారా, వారికి కేటాయించిన మొత్తం మ్యాపింగ్ల సంఖ్య, పూర్తయినవి, పెండింగ్లో ఉన్నవి వంటి వివరాలను వ్యక్తిగతంగా సమీక్షించారు.బిఎల్ఓ లను ఏ, బి, సి కేటగిరీలుగా విభజించిన నేపథ్యంలో అధిక మ్యాపింగ్ భారం ఉన్న బిఎల్ఓ లకు అవసరమైన సహాయక సిబ్బందిని కేటాయించారా లేదా అనే అంశంపై అధికారులను ప్రశ్నించారు. అలాగే బిఎల్ఓ లకు అందుబాటులో ఉన్న అసిస్టెంట్ల సంఖ్య, వారి సేవల వినియోగంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. హౌస్ షిఫ్ట్ అయిన ఓటర్ల మ్యాపింగ్ను నిబంధనల ప్రకారం ఎలా నిర్వహించాలి, వారి వివరాలను ఏ విధంగా నమోదు చేయాలి అనే అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ప్రతి ఏఈఆర్ఓ పరిధిలో ఉన్న మొత్తం మ్యాపింగ్ లక్ష్యాలు, పూర్తయిన పనులు, ఇంకా మ్యాపింగ్ కాకుండా మిగిలి ఉన్న గృహాలు లేదా ఓటర్ల వివరాలను అధికారుల వారీగా సమీక్షించారు.మ్యాపింగ్ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి విధులు నిర్వహించాలని, పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. సర్ -2026 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడంలో ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓ లు, సూపర్వైజర్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

మైలార్‌దేవ్ పల్లి, కాటేదాన్ డివిజన్లకు నూతనంగా మంజూరైన పనులను వెంటనే చేపట్టాలి - తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, నేటి శుభోదయ : డివిజన్ పరిధిలో నూతనంగా మంజూరైన పనులను ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను కోరడం జరిగిందని రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఇంచార్జ్ బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శనివారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఇంచార్జ్ బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మైలర్ దేవ్ పల్లి,కాటేదాన్ డివిజన్ కు సంబంధించిన నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు,డ్రైనేజ్ పైప్ లైన్ పనులు,కమిటీ హాల్ నిర్మాణం అభివృద్ధి పనులకు చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేసి అభివృద్ధి పనులను పూర్తి చేసే విధంగా చొరవ తీసుకోవాలని కమిషనర్ ను కోరడంతో సానుకూలంగా స్పందించిన కమిషనర్

సాధ్యమైనంత త్వరగా నిధులను మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పాండు యాదవ్,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్కిళ్లలో బోర్డర్ ప్లాంటేషన్‌తో నగర సౌందర్యానికి మరింత మెరుగులు

ఖమ్మం, నేటి శుభోదయ : ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన సర్కిళ్లు (కూడళ్లు)లో బోర్డర్ ప్లాంటేషన్ పనులు వేగంగా కొనసాగు తున్నాయి. నగర సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా సర్కిళ్ల చుట్టూ ఆకర్షణీయమైన అలంకార మొక్కలు, పుష్పించే మొక్కలు, పామ్ జాతులు, ఇతర హరిత మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తూ నగర సౌందర్యాన్ని మరింత మెరుగుపరుస్తున్నారు.హార్టికల్చర్ ఆఫీసర్ పర్యవేక్షణలో సిబ్బంది మొక్కల నాటడం, మట్టి సర్దుబాటు, ల్యాండ్‌స్కేపింగ్ పనులను చేపడు తున్నారు. నాటిన మొక్కలు ఆరోగ్యంగా పెరిగి సర్కిళ్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నారు. ప్రతి మొక్కకు అవసరమైన సంరక్షణ అందిస్తూ, దీర్ఘకాలికంగా పచ్చదనం నిలిచే విధంగా ప్రణాళికాబద్ధంగా పనులు నిర్వహిస్తున్నారు.సర్కిళ్ల చుట్టూ చేపడుతున్న బోర్డర్ ప్లాంటేషన్ వల్ల కూడళ్లు ఆహ్లాదకరంగా, పచ్చదనంతో కళకళలా డుతూ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. పచ్చదనం పెరగడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడుతుంది. నగరా

నికి వచ్చే సందర్శకులు, ప్రయాణికులకు ఖమ్మం నగరం మరింత పరిశుభ్రంగా, సుందరంగా కనిపించేలా ఈ కార్యక్రమం ఉపయో గపడుతోంది.నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటి సరఫరా, ఎరువుల వినియోగం, కలుపు మొక్కల తొలగింపు, నిర్వహణ చర్యలు చేపడుతూ వాటి పెరుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తు న్నారు. నగరాన్ని హరితవనంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఖమ్మం నగర పాలక సంస్థ సర్కిళ్లు, డివైడర్లు, పార్కులు మరియు ఇతర ప్రజా ప్రదేశాల్లో ఈ కార్యక్రమాలను మరింతగా కొనసాగిస్తోంది.

నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి**
- **మధ్యాహ్నం 1.30 గంటల తరువాత లోనికి అనుమతి ఉండదు**
- **ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వెంట తెచ్చుకోవద్దు**
- **పునః నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**

నిజామాబాద్ జిల్లా, నేటి శుభోదయ : ఈ నెల 21 ఆదివారం జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జరగనున్ననీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని అన్నారు.నీట్ పరీక్ష పునః నిర్వహణ ఏర్పాట్లపై శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు.ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో 3456 మంది పరీక్షకు హాజరు కానున్నారని,ఈ మేరకు జిల్లా కేంద్రంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల,నాగారంలోని మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల/కళాశాల,బోధన్ పట్టణంలో రైల్వే గేట్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో,డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిల్డింగ్,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల బిల్డింగ్,మాక్లూర్ లోని శ్రీ బిగాల కృష్ణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక నోడల్ అధికారిని నియమించామని అన్నారు.కాగా అభ్యర్థులు పరీక్ష ప్రారంభం అయ్యే సమయానికి కనీసం అరగంట ముందే లోనికి చేరుకో వాల్సి ఉన్నందున,నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరు కునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు.పరీక్ష కేంద్రంలోనికి అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని అన్నారు.నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.పరీక్ష హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు,రిజిస్ట్రేషన్,తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి

ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు.బయోమెట్రిక్ సమయంలో ఏదైనా సమస్య తలెత్తి ధృవీకరణ పూర్తి కాకపోయినా,అభ్యర్థులను పరీక్షా గదిలోకి ప్రవేశించడానికి అనుమతిస్తారని,అయితే అభ్యర్థులు లిఖితపూర్వక హామీ పత్రాన్ని సమర్పించాలని,హామీ పత్రం నమూనా పరీక్షా కేంద్రంలో అందించబడుతుందని తెలిపారు.అభ్యర్థులు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో,గుర్తింపు కార్డు,అడ్మిట్ కార్డు తమ వెంట తెచ్చుకోవాలన్నారు.ఎలక్ట్రానిక్ ఉపకారణాలైన మొబైల్ ఫోన్లు,డిజిటల్ చేతి గడియారాలు,బ్లూటూత్ వంటివి ఎట్టి పరిస్థితు లోనూ అనుమతించబడవని అన్నారు.అన్ని కేంద్రాలలో తాగునీటి వసతి,ప్రథమ చికిత్స సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు.ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని,పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని,కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.కాగా నీట్ పరీక్ష రోజున అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు ఉండే అవకాశం ఉన్నందున విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలని అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలేకు సూచించారు.కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశ్నాపత్రం,సమాధాన పత్రాల తరలింపునకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 164 (బీఎన్ఎస్) నిషేధాజ్ఞలు అమలు చేస్తూ,జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని,అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్ష సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడపాలని,విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో పరీక్షా కేంద్రాల నోడల్ ఆఫీసర్లు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జవాన్ కుటుంబ సభ్యులకు 50 వేల రూపాయలు ఆర్థిక సాయం

వైరా, నేటి శుభోదయ : వైరా మున్సిపాలిటీలో జవాన్ గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాంధీ లాల్ కుటుంబ సభ్యులు కు శనివారం వైరా మున్సిపల్ చైర్

పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ రూ 50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జవాన్ గాంధీలాల్ కుటుంబం అత్యంత నిరుపేద స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైరా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ కౌన్సిలర్ల అందరితో కలిసి సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అదే విధంగా శనివారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ పాల్గొని గాంధీ లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రవేట్ కార్పొరేట్ గుర్తింపు లేని పాఠశాలను అడ్డుకుంటాం

ఖమ్మం, నేటి శుభోదయ : ప్రైవేట్ కార్పొరేట్ గుర్తింపు లేని పాఠశాలను అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం శనివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఇష్టారాజ్యంగా దోపిడి తెరలేపాయి అడ్మిషన్స్ నుండి యూనిఫామ్స్ వరకు పుస్తకాల నుంచి బస్సు ఫీజుల వరకు ప్రతి అంశాన్ని ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఆదాయ వనరుగా ఆయా విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయి అన్నారు. పెరుగుతున్న ఫీజులు అదనపు ఫీజులు తో పేద మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నియంత్రించాల్సిన విద్యా శాఖ మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా పెద్దపెద్ద బిల్డింగ్స్ లో పాఠశాలలో ఏర్పాటు చేయడంతో పాటు రంగురంగుల బ్రోచర్లు హోర్డింగ్స్ లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ విద్య హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోక పోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలపై ప్రత్యక్షంగా దాడులు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు బుర్ర మనోజ్, శివ నాయక్, పవన్, గోపి, చైతన్య, వెంకట్, రాంబాబు, రాము, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు ఘన వీడ్కోలు

- నూతన అధికారులకు హృదయపూర్వక స్వాగతం

కేశంపేట, నేటి శుభోదయ : కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బదిలీపై వెళ్లిన ఎంపీఓ కృష్ణయ్య తో పాటు పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, శ్రీనివాసులు, ధనుంజయ్, స్వరూప్ మార్, అవినాష్ కుమార్ గౌడ్, శ్రీశైలం, లక్ష్మీ ప్రసన్న, రమాదేవి, యాదయ్య, అలివేలు, జయప్రకాశ్, టైపిస్టు, అటెండర్లు రామ్మోహన్ మరియు శేఖర్‌లకు ఘన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అదే సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీఓ దయానంద్ గారితో పాటు కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది బదిలీపై వెళ్లిన ఉద్యోగులతో తమకున్న అనుబంధాన్ని, కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగంగా మాట్లాడారు. వారి సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీఓ దయానంద్, ఏఈపీఆర్ నర్సింగరావు, మిషన్ భగీరథ ప్రదీప్, ఏపీఓ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి హాజరై ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా వచ్చిన సిబ్బందికి సహకారం అందిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శులు జగన్, విద్యావతి, విజయ్ కుమార్, సందీప్, వెంకట్ రెడ్డి, నదీమ్ తదితరులు సమన్వయం చేస్తూ విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగి అందరినీ ఆకట్టుకుంది.

ఉన్నతి,శిక్ష ఫౌండేషన్ ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సహం

తలకొండపల్లి, నేటి శుభోదయ : రంగారెడ్డి జిల్లా, తల కొండపల్లి మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరివచిన విద్యార్థిని, విద్యార్థులకు ఉన్నతి,శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి సన్మానం చేసి , నగదు బహుమతి ప్రోత్సహకంగా అందించారు.చైర్మన్ మాట్లాడుతు....ప్రభుత్వ విద్యాలయాలు బలోపేతం చేస్తే, పేద విద్యార్థులకు ఉపయోగ పడటమే కాకుండా,మట్టిలో మాణిక్యాలు తీసినట్లు అవుతుంది అన్నారు.అందుకు ఉదాహరణ గా... ఈ మధ్యకాలంలో వెలువడిన 10వ తరగతి ఫలితాలలో గట్టుయిప్పలపల్లి,తలకొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐఐఐటి బాసరలో సీట్లు సాధించడం మనందరికి గర్వకారణం అని కొనియాడారు. ప్రభుత్వ విద్యాలయాల బలోపేతానికి మా ఫౌండేషన్ నుండి సహాయం, సహకారాలు ఉంటాయని తెలియజేశారు.ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి ....మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తెచ్చి సమాజానికి తొడపడాలని తెలిపారు,ఫౌండషన్ సేవలు అభినందనీయం అని కొనియాడారు. ఎంపీడీఓ సీతా రావమ్మా మాట్లాడుతూ.... విద్యార్థులు చెడు అలవాట్లకు పోకుండా,ఫోన్లు వాడకుండా మంచి క్రమశిక్షనతో ఎదగాలని,విద్యను మించిన శక్తీ వంతమైన ఆయుధంలేదని తెలిపారు. ఈ కార్యక్రమలో ఎం ఈ ఓ చంప్లనాయక్,ఫౌండేషన్ సెక్రటరీ బండి రఘుపతి, స్థానిక సర్పంచ్ శేఖర్, ఏ ఎం సి డైరెక్టర్ అంజయ్య స్కూల్ హే చెమ్ ఝాన్సీ , కళాశాల అకాడమిక్ ఇంచార్జి కృష్ణకాంత్ , ఫౌండేషన్ సభ్యులు శ్రీరామ్, రమేష్, యాదగిరి, నితిన్, శివ మల్లేష్, విద్యార్థులు,తల్లిదండ్రులు,అధ్యాపకులు అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- జమాల్ ఖాన్

చింతూరు, నేటి శుభోదయ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు జమాల్ ఖాన్ పేర్కొన్నారు.స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు,ప్రముఖ సామాజిక సేవకులు జమాల్ ఖాన్ పాల్గొని పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రపరుస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులకు, యువతకు పరిశుభ్రమైన పరిసరాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. గ్రామంలో అవసరమైన వారికి మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఇంటా కనీసం ఒక మొక్కను పెంచాలని సూచించారు.అలాగే స్థానిక అంగన్‌వాడీ పాఠశాలను సందర్శించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించి వాటి కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని జమాల్ ఖాన్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకటేశ్వరావు,క్లస్టర్ ఇంచార్జ్ నరసింహారావు,మార్కెట్ కమిటీ సభ్యులు సల్మాన్ రాజు,సీడీపీఓ చింతూరు,సూపర్వైజర్లు ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలానికి కేశంపేట అప్రమత్తం
– వరద ముప్పు ప్రాంతాలపై అధికారుల ప్రత్యేక దృష్టి

కేశంపేట, నేటి శుభోదయ : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కేశంపేట మండలంలో వరద ముప్పు నివారణ చర్యలపై అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ, విద్యుత్, ఆర్ & బి, నీటిపారుదల శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, జేపీఓలు, సర్పంచులు పాల్గొన్నారు. వర్షాల వల్ల నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. శాఖల వారీగా బాధ్యతలను సమీక్షించి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని సూచించారు.అనంతరం ఎస్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో నిర్దవెల్లి–తొమ్మిదిరేకుల రహదారిని పరిశీలించి, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించారు. తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో సమర్థవంతమైన సమాచార మార్పిడి కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి
- జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి

ఖమ్మం, నేటి శుభోదయ : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి శనివారం తెలిపారు.జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు.

అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి కోరారు.

ముఖ్యమంత్రి మాట్లాడే భాష మార్చుకోవాలి
- తెలంగాణ బిసి, ఎస్సీ ఎస్టీ మైనారిటీ అసోసియేషన్ జెఎసి నాయకులు

వైరా, నేటి శుభోదయ : మొన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజి అడిషనల్ డిజిపి,బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పై సీఎం రేవంత్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడిన మాటలను వాపస్ తీసుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని స్వేరోస్ నెట్వర్క్ మాజీ జిల్లా అధ్యక్షులు,బీసీ, ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీ అసోసియేషన్ జాక్ , ఖమ్మం జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో డిమాండ్ చేశారు. వైరా లో ఏర్పాటు చేసిన మిడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని సంక్షేమ శాఖల అయా శాఖల మంత్రులకే తెలియకుండా ప్రాజెక్టు మానిటరింగ్ యునిట్ పేరుతో జీవో నెంబర్ 17 ని అక్రమంగా తీసుకొనివచ్చి గురుకులాలలో దాదాపుగా 2 వేల కోట్ల టెండర్లలో నిధులు గోల్ మాల్ జరుగుతున్నాయని ప్రవీణ్ కుమార్ మాట్లాడిన దాంట్లో ఎలాంటి అనుమానం లేదని అన్నారు. తెలంగాణకి చెందిన కాంట్రాక్టర్లను కాదని ఈ రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులకు పొట్టకొట్టి, పక్క రాష్ట్రంలోని మఫత్ లాల్ , చింతామణి రమేష్ జైన్ లాంటి కాంట్రాక్టర్లతో కుమ్మక్కు అయ్యి గురుకుల పాఠశాల టెండర్లను అప్పజెప్పడాన్ని బీసీ, ఎస్సీ ,ఎస్టీ మైనారిటీ జాక్ నుండి తీవ్రంగా ఖండిస్తుందన్నాము అని తెలిపారు. గురుకులాల్లో టెండర్ లో పాల్గొనాలంటే దాదాపుగా 200 కోట్లు నుండి 250 కోట్ల వరకు టర్నోవర్ చూపించాలని తెలంగాణకి చెందిన చిన్న, మధ్యతరహా కాంట్రాక్టర్లు కుట్రలు చేయ్యడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ లోని పేద వర్గాలకు చెందిన చిన్న కాంట్రాక్టర్ల దగ్గర 250 కోట్ల టర్నోవర్ చూపించే స్థాయి ఉన్నదా? అని ఆయన ప్రశ్నించారు.నిజంగా గురుకుల టెండర్ల అక్రమాలు జరగలేదని అంటే అధికారం తమ దగ్గర ఉంది గనుక మీరే నిరూపించే ప్రయత్నం చేసి ప్రజలు తెలియచేయ్యలీ గాని మరి ప్రశ్నించిన వారిపై బాడీ షేవింగ్ వ్యాఖ్యలు ఎంతవరకు సమంజసం అనేది మీరు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. తమ పాలనలో దాదాపుగా 130 మంది గురుకుల విద్యార్థులు చనిపోతే ఏ ఒక్కరిని కూడా ఇప్పటివరకు పరామర్శించే సమయంలో లేని ముఖ్యమంత్రి అదే గురుకులాల స్థాయిలో విద్యార్థులని ప్రపంచ స్థాయిలో తీసుకుని వెళ్లిన ఘనత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ది తెలుసుకొని క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెఎసి ,ఆర్ యస్పి సైన్యం నాయకులు శ్రీనాథ్, బి.వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గ నాయకులు శ్రీధర్, కె.ప్రసాద్ చిరంజీవి,శ్రీనువాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల వైద్య విధాన పరిషత్ సిహెచ్సి ఆసుపత్రి సివిల్ సర్జరీ చేసిన డాక్టర్ విసంపల్లి వెంకటేశ్వర్లు

తిరుమలాయపాలెం, నేటి శుభోదయ : తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వైద్య విధాన పరిషత్ సి హెచ్ సి ఆసుపత్రిలో తొలి సివిల్ సర్జరీ సేవలు మండలం లోని వెదుళ్ళ చెరువు గ్రామానికి చెం దిన సీతారాములనే వృద్ధుడు గత కొద్ది సంవత్సరాలుగా ఐడ్రోసిల్ తో బాధపడుతూ ఇన్ఫెక్షన్ గురి కావడంతో శని వారం ఆయన కుటుంబ సభ్యు లు తిరుమలాయపాలెం ఆసుపత్రికి తీసుకువెళ్లారు దీంతో ఆసుపత్రి సూపరిండెంట్ కృ పా ఉషశ్రీ సివిల్ సర్జన్ డాక్టర్ విసంపల్లి వెంకటేశ్వర్లు, మత్తు డాక్టర్ లవన్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్ర చికిత్స ని హించి

హైడ్రోసిల్లి పూర్తిగా తొ లగించారు తిరుమలాయపా లెం ఆసుపత్రిలో శనివారం తొలిసారిగా జనరల్ సర్జరీ సే వలు ప్రారంభం కావడంతో డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొం దుతున్న సీతారాములు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సర్జ రీని విజయవంతం చేసిన వైద్యులను అభినందించారు.

పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

తిరుమలాయపాలెం, నేటి శుభోదయ : యోగం మనిషికి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించే అమూల్యమైన భారతీయ సంస్కృతి సంపద" అని ప్రభుత్వ జూనియర్ కళాశాల పిండిప్రోలు ప్రిన్సిపాల్ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, పిండిప్రోలులో శనివారం ఉదయం ఘనంగా యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను అభ్యసించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ, యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మన శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే సమగ్ర జీవన విధానమని అన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, జీవనశైలి వ్యాధుల నుండి బయటపడటానికి యోగా ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి. నారాయణరావు మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన కానుక యోగా అని తెలిపారు. యోగాభ్యాసం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, సానుకూల దృక్పథం పెంపొందుతాయని వివరించారు. "యోగం ఆరోగ్యానికి మార్గం మాత్రమే కాదు, ఆనందమయమైన జీవితానికి పునాది" అని అన్నారు.ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు చంద్రమౌళి, వీరస్వామి మాట్లాడుతూ

యోగాభ్యాసం విద్యార్థులు, యువతలో క్రమశిక్షణ, ఏకాగ్రత మరియు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడుతుంద ని తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు సతీష్, పరశురాం, మురళీకృష్ణ, రామ్మూర్తి , విజయలక్ష్మి , జయశ్రీ, శ్రీలత, ఉపేంద్రచారి, ఉపేందర్, వీరభద్రం, రామదాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. యోగాభ్యాసం అనంతరం అధ్యాపకులు పరస్పరం అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని, ఎన్.ఎస్.ఎస్. విభాగాన్ని పాల్గొన్నవారు అభినందించారు.ఈ సందర్భంగా "ఆరోగ్యవంతమైన శరీరం – ప్రశాంతమైన మనస్సు – ఆనందమయమైన జీవితం" అనే సందేశాన్ని అందరికీ చేరవేస్తూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

అత్తాపూర్ అనంత పద్మనాభ స్వామి చెరువు కబ్జా

- అక్రమార్కులకు అధికారుల అండ!

- సర్వే నంబర్ 365లోని ఆరు ఎకరాల చెరువుపై కబ్జాదారుల కన్ను: ఆవేదనలో భక్తులు.
- దేవాలయ పూజారి పేరుతో భూ బదలాయింపు: ఘరానా మోసానికి పాల్పడుతున్న ముఠా.
- చెరువు అభివృద్ధి నిధులకు అడ్డుతగులుతున్న స్టే ఆర్డర్లు: అధికారుల తీరుపై భక్తుల మండిపాటు.
- వర్షాలకు తెగే స్థితిలో చెరువు కట్ట: తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కలెక్టర్, హైడ్రాకు విజ్ఞప్తి.

రాజేంద్ర నగర్, నేటి శుభోదయ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా కమిషన్ ఏర్పాటు చేసి చెరువులను కాపాడుతున్న దానికి ప్రజల నుండి ఎంతో మద్దతు లభిస్తుందని అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి విచ్చేసే భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.అందులో భాగంగా అత్తాపూర్ లోని అనంత పద్మనాభ స్వామి దేవాలయకి సంబంధించిన చెరువును కొందరు అక్రమార్కులు కబ్జాకు పాల్పడి దానిని విక్రయించి అభివృద్ధి చేయకుండా అడ్డుపడుతున్న దానిపై తీవ్రంగా మండిపడ్డారు.అయితే కొందరు వ్యక్తులు ముందుకు వచ్చి చెరువును కాపాడేందుకు ప్రయత్నిస్తున్న దానిని భూకబ్జాదారులు ఎప్పటికప్పుడు అడ్డు తగలడం చాలా విడ్డూరంగా ఉందని ఆలయ భక్తులు ఆరోపించారు.అంతేకాకుండా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ఎంతో పెద్ద మనసు చేసుకొని చెరువు పరిరక్షణ కోసం ప్రయత్నించడం ఆనందం వ్యక్తం చేస్తుందని ఆలయ భక్తులు సూచించారు.అందులో భాగంగానే ఎండోమెంట్ అధికారుల చిత్ర విచిత్ర వేషధారణ..దేవాలయ ఆస్తులను కాపాడాల్సిన అధికారులలే అక్రమార్కులతో చేతులు కలిపి కోర్టులో కేసు బెంచి పైకి రాకుండా చేస్తున్న ఇరిగేషన్,ఎండోమెంట్ అధికారుల చేతివాటం అమోఘమని భక్తులు మండిపడుతున్నారు. ఎక్కడినుండో ఇక్కడికి వచ్చి దేవాలయంలో పూజలు చేసుకుని జీవనం సాగిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి ఉన్న దేవాలయ పూజారిని మోసం చేసి అతని పేరుపై ఉన్న దేవాలయ ఆస్తులను తమ పేరుపై రాసుకున్న ఘరానా మోసగాడు అనంత పద్మనాభ స్వామి పూజారి శ్రీనివాస్ కో అండ్ బ్రదర్స్ నిర్వాకం.పూర్తి వివరాల్లోకి వెళితే...రాజేంద్రనగర్ మండలం,ప్రస్తుత సర్కిల్ అత్తాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 365లో 6 ఎకరాల 2 గుంటల భూమిలో చెరువు ఉందని భక్తులు సూచించారు.చెరువుకు ఆనుకొని ఉన్న అతి ప్రాచీనమైన అనంత పద్మనాభ స్వామి దేవాలయం.అయితే గతంలో సికింద్రాబాద్ కు చెందిన ఓ పూజారి ఇదేవాలయంలో పూజలు చేసి జీవనం సాగించేవారు.దీంతో అతని వయసు పై పడటంతో కర్ణాటక కు చెందిన కొందరు దొంగ పంతులు అతని మచ్చిక చేసుకుని దేవాలయంలో పూజలు చేసి మీతో పాటు మేము ఉంటామని కల్లబొల్లి మాటలు చెప్పారు.అది నమ్మిన కురువృద్ధుడు వారికి ఆశ్రయం కల్పించాడు.అదే చనువుగా ఉన్న శ్రీనివాస్ బ్రదర్స్ బ్యాచ్ తమ చేతివాటం చూపించి తమ తండ్రిపై దేవాలయ భూములను పేరు మార్పిడి చేసి ఘరానా ముసలకు పాల్పడుతున్నారు.ఇదే క్రమంలో అనంత పద్మనాభ స్వామి టెంపుల్ చుట్టూ ఉన్న భూములను సొంత భూములుగా భావించి అమ్ముకొని రెవిన్యూ అధికారులనే తమ చుట్టూ తిప్పుకునేలాగా మార్చుకున్నారు.ఇదే క్రమంలో అనంత పద్మనాభ స్వామి దేవాలయనికి ఆనుకొని ఉన్న చెరువును ఇతరులతో కలిసి అమ్ముకోవడం జరిగింది.అయితే గత తెలంగాణ ప్రభుత్వం చెరువు అభివృద్ధి కోసం 4కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేసి సుమారు 40 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు.అయితే కొందరు అక్రమంగా కొనుగోలు చేసిన భూ అక్రమార్కులు కోర్టును ఆశ్రయించి స్టేతస్కో స్టేట్ ఇచ్చి పనులు నిలిపివేయడం జరిగిందన్నారు.ఈ విషయమై ఇరిగేషన్ అధికారులను కొందరు సంప్రదిస్తే సంవత్సరం తర్వాత స్పందించి కోర్టులో కేసు వేయడం ఎంత దుర్మార్గం అని భక్తులు ఆరోపిస్తున్నారు.అంతేకాకుండా దేవాలయంలో పూజలు చేసుకుని జీవించాలి తప్ప దేవాలయ భూములు అమ్ముకొని ఎవరైనా అడ్డు చెబితే రౌడీల చేత బెదిరింపులకు పాల్పడం శ్రీనివాస్ పంతులు తెలివితేటలు మెచ్చుకోవాలని భక్తుల ఆరోపిస్తున్నారు.దీంతోపాటు గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దేవాలయనికి చెందిన చెరువు పూర్తిగా నిండి ఇప్పుడు కట్ట తెగిపోతుంది అని భయపడాదుల గురి అవుతున్నారు.చెరువు కట్ట తగ్గిపోతే అనంత పద్మనాభస్వామి దేవాలయంలోకి,అందులోనే ఉన్న గోశాల,దీనికి అనుకొని ఉన్న పాండురంగ నగర్ నీట మునగాల్సిన దుస్థితి ఏర్పడుతుందని కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు కుంటలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంటున్న ఈ చెరువుపై చిన్నచూపు చూపడం చాలా విడ్డూరంగా ఉందన్నారు.అంతే కాకుండా గ్రేటర్ మున్సిపల్ అధికారులు, రెవిన్యూ,ఇరిగేషన్,హైడ్రా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయమని భక్తులు ఆరోపిస్తున్నారు.దీంతోపాటు కబ్జా చేసి అమ్ముకున్న వ్యక్తులకే ప్రభుత్వ అధికారులు అండదండలు చూపించి కోర్టులో కేసు బెంచ్ పైకి రాకుండా జాగ్రత్త పడుతున్న అధికారుల తెలివితేటలకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని భక్తులు ఆక్రోషం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ముంపుకు గురవుతున్న అనంత పద్మనాభ స్వామి దేవాలయం చెరువును సందర్శించి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, నేటి శుభోదయ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల వివరాలను పొందుపరుస్తూ ఆయా శాఖల వారీగా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం అన్ని శాఖల అధికారులు,ఆయా మండలాల ఎంపీడీఓలు,తహసిల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల నిర్వహణ తీరును పర్యవేక్షించి,తగిన దిశా నిర్దేశం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్లను నియమించిందని అన్నారు.ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ గా నియమితులైన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి,సీనియర్ ఐ.ఏ.ఎస్ డాక్టర్ యోగితారాణా త్వరలోనే జిల్లాకు విచ్చేసి ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల అమలును సమీక్షించడం జరుగుతుందన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా శాఖల ఆధ్వర్యంలో గ్రామ, మండల,నియోజకవర్గ,జిల్లా స్థాయిలో,వార్డులు,మున్సిపల్ పట్టణాల వారీగా నిర్వహించిన గ్రామ సభలు,ఇతర కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ సోమవారం సాయంత్రంలోపు సమగ్ర నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో నిర్దేశించిన అంశాలతో పాటు కొత్తగా వినూత్న రీతిలో ట్రాన్స్ జెండర్ల నిషేధంపై సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించడం,మారుమూల పల్లెలకూ ఆర్టీసీ బస్సు సర్వీసుల విస్తరణ,శ్రమదానం,ప్రభుత్వ పథకాలను ప్రజలకు విస్తృత స్థాయిలో చేరవేసేందుకు సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ల సేవలను వినియోగించుకోవడం వంటి వినూత్న కార్యక్రమాలను కూడా జిల్లాలో నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు.వాటి వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రగతి ప్రణాళిక సభల నిర్వహణ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన అభ్యర్థనలు,వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు,వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా వర్గాల వారికి చేకూర్చిన లబ్ధి గురించి నివేదికల్లో వివరాలు పొందుపరచాలని అన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్,డీ.ఆర్.డీ.ఓ సాయన్న,డీ.ఈ.ఓ అశోక్,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం

- గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాల కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఉత్సాహంగా ఆసనాలు వేసిన విద్యార్థులు

ఖమ్మం, కూసుమంచి, నేటి శుభోదయ : కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో స్కూల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకొని ముందస్తుగా శనివారం యోగా డే నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాల కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్రతిరోజూ యోగా సాధాన చేయాలన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే జీవన విధానమని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయాలని, దానిని తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో వివిధ యోగాసనాలు చేయించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా చేయడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనసు ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత పెరిగి చదువుపై మరింత దృష్టి సారించగలరని తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ జార్జులు జహ్నవి,పాపారావు, నాజియా ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమం

- నూతి సత్యనారాయణ గౌడ్

ఖమ్మం, నేటి శుభోదయ : కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు స్టూడెంట్ వాయిస్ పేరుతో కేంద్ర ప్రభుత్వా నికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజి పై కేంద్రం ప్రభుత్వం బాధ్యత వహించాలని, లీకేజీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారి వల్ల లక్షల మంది విద్యార్థులు ఎన్నో కష్టనష్టాల కోర్చి పరీక్ష వ్రాసిన తర్వాత రద్దు కావటం వల్ల విద్యార్థులు ,విద్యార్థుల తల్లి దండ్రులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి అయ్యారని అన్నారు. అదే విధంగా ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై ఎన్నో అపోహలున్నాయి అని కేంద్ర (బి జె పి) ప్రభుత్వం కుటిల రాజకీయ చతురతకు నిదర్శనం అని అన్నారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పదవీభాధ్యతలు స్వీకరించిన తర్వాత మన ఖమ్మం జిల్లాకు మొట్ట మొదటి సారి విచ్చేయుచున్న సందర్భంగా స్వాగతం పలుకుతూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమావేశం 22 న సాయంత్రం 3.00 గంటలకు సప్తపది ఫంక్షన్ హాల్ లో కలదు మన ప్రజా పాలన గావిస్తున్న ప్రభుత్వం మహిళల కొరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని,భవిష్యత్ లో మహిళా శ్రేయస్సు కొరకు మరెన్నో సంక్షేమ పథకాలు చేపట్టనున్నారని అట్టి ప్రభుత్వాన్ని ఆశీర్వదినటానికి జిల్లా లోని నలు మూలల నుండి మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత మాజీ ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమంను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు భానోత్ వినోద, రేఖా భార్గవి,సుకన్య తదితర నాయకులు పాల్గొన్నారు.

మనిషి సంపూర్ణ వికాసానికి యోగ ఒక దివ్యౌషధం

నిజామాబాద్ రూరల్ : ప్రపంచ మానవాళికి శాంతిని చేకూర్చే దివ్యౌషధం యోగా మాత్రమే అని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠ శాల జూనియర్ కళాశాల ప్రిన్సి పల్ గడ్డం రాజేశ్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతు న్నారని, అదేవిధంగా ప్రపం చమంతా యుద్ధాలతో, పరస్పర దాడులతో భయానక వాతావరణంలో, భయం గుప్పిట్లో సతమతమవు తోందని, ఇటువంటి పరిస్థితుల్లో యోగా మాత్రమే ప్రజలకు సురక్షిత జీవితాన్ని, ఆరోగ్యాన్ని, సుఖసంతోషాలను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. అందుకే నేడు ప్రపంచమంతా యోగ సాధనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రపంచానికంతటికి మన దేశం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. భారతీయులమైన మనం తప్పనిసరి యోగాను మన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపల్ సౌమిత్రి యోగ ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల చేత యోగ ఎలా చేయాలో , యోగ వలన శారీరక మానసిక ప్రాధాన్యతను తెలిపారు. ఉపాధ్యా యులు శ్రీనివాస్, గంగరాజు విద్యార్థులచే యోగా ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పిఎం కిసాన్ సమ్మన్ నిధి కార్యక్రమం సక్సెస్

వైరా, నేటి శుభోదయ : కృషి విజ్ఞాన కేంద్రం వైరా నందు 23వ విడత పిఎం కిసాన్ సమ్మన్ నిధి ప్రోగ్రాం ను శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెవికె వైరా హెడ్, సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ భూమి సారం తగ్గిపోతుంది. మన భూమిని కాపాడుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత గురించి, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, పప్పు ధాన్యాలలో ఆత్మ నిర్భర భారత్ ప్రోగ్రాం , తక్కువ రసాయన ఎరువుల వాడకం, రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలని సూచించారు, శాస్త్రవేత్త పి .ఎస్ . యం. పణిశ్రీ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, ప్రస్తుతం ఖరీఫ్ లో వేసుకోవాల్సిన వరి, అపరాల రకాల గురించి వివరించడం జరిగింది. వైరా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకం వాటి ఆవశ్యకత నేల ఆరోగ్యం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్యాక్ట్ మేనేజర్ నాగార్జున, ఖమ్మం జిల్లా ప్రతినిధి రామకృష్ణ, గొల్లపూడి , గన్నవరం విస్తరణ అధికారులు ఎం రాజేష్, వెంకట నరసయ్య, కె.వి.కె సిబ్బంది పాల్గొనడం జరిగింది.

యూరియా కోసం రైతుల అవస్థలు

- యాప్ గందరగోళంతో సిరికొండలో పడిగాపులు

నిజామాబాద్ రూరల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిరికొండ మండల కేంద్రంలోని ఎరువుల విక్రయ కేంద్రం వద్ద రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో యూరియా పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతున్నట్లు రైతులు వాపోతున్నారు.మండుటెండలో క్యూలలో నిలబడుతూ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటల సాగుకు అత్యవసరమైన సమయంలో యూరియా అందకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాప్ కారణంగా పంపిణీ ఆలస్యం కావడం, సర్వర్ సమస్యలు తరచూ ఎదుర వడం వల్ల రైతులు పలుమార్లు కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియాను సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే యాప్ విధానాన్ని సరళీకృతం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి యూరియా కొరత లేకుండా పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

మండల్ రాధాకృష్ణ యాదవ్, బృందావన్ యాదవ్‌లకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యాతం విశాల్ యాదవ్

మల్కాజిగిరి, నేటి శుభోదయ : మల్కాజ్గి రి ప్రాంత ప్రజల అభిమానాన్ని చూర గొన్న జన హృదయ నేత మండల్ రాధా కృష్ణ యాదవ్‌కు, ఆయన తనయుడు మం డల్ బృందావన్ యాదవ్‌కు మల్కా జ్గిరి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి యాతం విశాల్ యాదవ్ హృదయపూర్వక జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో ఆత్మీయ అనుబంధం కొనసాగిస్తూ సా మాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే రాధాకృష్ణ యాదవ్, యువతకు ఆద ర్శంగా నిలుస్తున్న బృందావన్ యాదవ్ లు ఆయురారోగ్యాలతో, ఆనందోత్సాహాలతో నిండి మరెన్నో పుట్టినరోజులను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సేవా సంకల్పంతో సమాజానికి మరింత సేవలం దిస్తూ కుటుంబ సమేతంగా సుఖసంతోషా లతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరికీ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేస్తూ వారి ప్రజాసేవా ప్రస్థానం నిరంతరం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిం చారు.

అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం



చింతూరు, నేటి శుభోదయ : అన్నదాత కు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వ నాయకులు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారుని చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ పేర్కొన్నారు అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద చింతూరు మండల రైతులకు రూ.1 కోటి 96 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది అని తెలిపారు.ఈ సందర్భంగా చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవ సాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పు టికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిధులను కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. రైతు కుటుంబాల ఆదాయం పెంచడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రై తుల అభ్యున్నతి కోసం సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి, మార్కెటింగ్ సౌకర్యాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు లక్ష్మయ్య,ఎంఏఓ రత్న ప్రభ చింతూరు, మార్కెట్ కమిటీ సభ్యులు సల్మాన్ రాజు,సొసైటీ బ్యాంకు సభ్యులు చంద్రయ్య,అణిగి రాజు, సిబ్బంది,రైతులు తదిత రులు పాల్గొన్నారు.

కొండాపూర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరీ కాలనీలో అక్రమ నిర్మాణాలు..

- చోద్యం చూస్తున్న పట్టణ ప్రణాళిక విభాగం.. పిర్యాదులు బుట్ట దాఖలేనా?

శేరిలింగంపల్లి నేటి శుభోదయ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరీ కాలనీల లోజోరుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై పిర్యాదులు అందితే వెంటనే చర్యలు ఉంటాయని, బిల్డరులు పరిమితులు దాటకుండా పారదర్శకంగా నిర్మాణాలు చేపట్టాలని సైబరాబాద్ మున్సిపల్ కమి షనర్ సృజన ఆదేశాలు బేఖాతరు చేస్తూ బిల్డింగుల నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్న పట్టించుకోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది. ఫిర్యాదులు చేస్తే తక్షణమే చర్యలు తీసుకోవా లని జి హెచ్ ఎం సి ఉన్నత అధికారుల మాటలు నీటి మూటలేనా అని స్థానిక ప్రజలు వాపోతున్నారు. హైటెక్ సిటీ కి అత్యంత సమీపంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర కాలనీలో కాలనీ సి బ్లాక్ లో ప్లాట్ నెంబర్ 347, 450, రాజ రాజేశ్వరీ కాలనీ మెయిన్ రోడ్ లో ప్లాట్ నెంబర్ 99 రత్న దీప్ సూపర్ మార్కెట్ ఎదురుగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలపై పిర్యాదు లు చేసిన బుట్ట దాఖలు చేయడం గమనార్హం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాల జోరు తో బోర్ లో నీరు అడుగంటి ట్యాంకర్ ల పై ఆధారపడాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యింది అని అలాగే పార్కింగ్ సౌకర్యం లేకుండా భవనాలు నిర్మిస్తున్న పట్టించుకొక పోవడం తో రోడ్ల మీద పార్కింగ్ లు, ట్రాపిక్ సమస్యలు, పరిమితికి మించి నివాసం ఉంటున్న ప్రజల

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు.

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ : ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.పరిశీలనలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలైన టీజీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల పాల్వంచ, శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కొత్తగూడెం, సింగరేణి ఉమెన్స్ కళాశాల కొత్తగూడెంలలో కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ కౌంటర్లు, బయోమెట్రిక్ ధృవీకరణ కేంద్రాలు, పరీక్షా గదులు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ, జామర్ల ఏర్పాటు, అలారాలు, గోడ గడియారాలు తదితర అంశాలను నిశితంగా పరిశీ లించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు మొత్తం 1,128 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్-163 అమల్లో ఉంటుందని అన్నారు . పరీక్షా కేంద్రాల సమీ పంలోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను పరీక్షా సమయాల్లో మూసి వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని, అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, కాలిక్యులే టర్లు తదితర ఎలక్ట్రానిక్ పస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావ ద్దని అభ్యర్థులకు సూచించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు సహా అన్ని మౌలిక సదు పాయాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని శాఖల సమన్వయంతో అవ సరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, తాసిల్దార్లు ధారా ప్రసాద్, పుల్లయ్య, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం | హైదరాబాద్
21 - 06 - 2026
www.netisubhodaya.com
నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

నీట్-2026 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీసుల విస్తృత భద్రతా ఏర్పాట్లు

నేటి శుభోదయ, సంగారెడ్డి : ఆదివారం తేది: 21.06.2026న నిర్వహించనున్న నీట్ –యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తెలిపారు.జిల్లాలో ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల – సంగారెడ్డి–1, జేఎన్‌టీయూ – 2 కేంద్రాలు, కేంద్రీయ విద్యాలయం (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ) – 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), సంగారెడ్డి – 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి – 1, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల – 1, ప్రభుత్వ మహిళల జూనియర్ కళాశాల – 1, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల) పటాన్‌చెరు – 1. మొత్తం =9 కేంద్రాలలో 2,924 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఎస్పీ తెలియజేశారు.

ఈ సందర్భంగా జిల్లా లో ఉన్న పలు పరీక్ష కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ అక్కడి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు జరుగనున్న ఈ పరీక్షకు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించడం జరుగుతుందని స్పష్టం చేశారు.పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో 163 బి.యన్.యస్.యస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగడం నిషేధమన్నారు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు సేవలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ఎలాంటి సిగ్నల్స్ అందకుండా జామర్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులు మరియు ఇన్విజిలేటర్లు ఎవరూ ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని హెచ్చరించారు.

నీట్-యూజీ 2026 అభ్యర్థులకు సూచనలు

* అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డ్‌తో పాటు చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు తీసుకురావాలి
* పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు – 2, పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో – 1 తీసుకురావాలి
* పారదర్శక వాటర్ బాటిల్ మాత్రమే అనుమతించబడుతుంది
* మెటల్/బంగారు/వెండి నగలు, గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధం
* షూస్, సాక్స్ ధరించడం అనుమతి లేదు (సాధారణ చప్పులతో మాత్రమే అనుమతిస్తారు)
* నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి – ఆలస్యంగా వచ్చిన వారికి ప్రవేశం లేదు
* అడ్మిట్ కార్డ్‌లో సూచించిన ఎన్‌టీఏ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

అభ్యర్థులు ఎటువంటి ఆందోళనలకు లోనవకుండా, నిబంధనలు పాటిస్తూ పరీక్షకు హాజరుకావాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఈ సందర్శనలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డియస్పీ సత్యయ్య గౌడ్, సంగారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ రామునాయుడు, కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ : జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును మరింత పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగో త్రైమాసిక జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డ్ ప్రతినిధులు, వివిధ వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలు, సాధనపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2026 మార్చి 31 నాటికి జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగంలో రూ.4,945.28 కోట్ల లక్ష్యానికి గాను రూ.5,201.20 కోట్లు మంజూరు చేసి 105.18 శాతం సాధన నమోదైనట్లు వెల్లడించారు.వ్యవసాయ రంగంలో రూ.3,899.28 కోట్ల లక్ష్యానికి గాను రూ.4,351.34 కోట్లు మంజూరు చేసి 111.59 శాతం సాధన నమోదైంది. ఇందులో పంట రుణాల కింద రూ.2,291.82 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,884.65 కోట్లు (82.20 శాతం), అగ్రి టర్మ్ లోన్స్ కింద రూ.1,416.09 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,622.20 కోట్లు (114.55 శాతం), అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.31.41 కోట్ల లక్ష్యానికి గాను రూ.19.09 కోట్లు (58.71 శాతం), అనుబంధ వ్యవసాయ కార్యకలాపాల కింద రూ.159.97 కోట్ల లక్ష్యానికి గాను రూ.825.40 కోట్లు (515.97 శాతం) మంజూరు చేసినట్లు వివరించారు.ఎంఎస్ఎంఈ రంగంలో రూ.847.80 కోట్ల లక్ష్యానికి గాను రూ.703.88 కోట్లు మంజూరు చేసి 83.02 శాతం సాధన నమోదైంది. విద్యా రుణాల కింద రూ.25.39 కోట్ల లక్ష్యానికి గాను రూ.11.21 కోట్లు (44.15 శాతం), గృహ రుణాల కింద రూ.233.62 కోట్ల లక్ష్యానికి గాను రూ.255.22 కోట్లు (109.25 శాతం) మంజూరు చేసినట్లు తెలిపారు. సామాజిక మౌలిక వసతుల రంగంలో రూ.3.30 కోట్ల లక్ష్యానికి గాను రూ.0.34 కోట్లు మాత్రమే మంజూరు కావడంతో 10.30 శాతం సాధన నమోదైందన్నారు.ఈ సందర్భంగా రైతు రుణాల పంపిణీ అంశంపై బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పంట రుణాల పంపిణీ లక్ష్య సాధన తక్కువగా ఉన్న బ్యాంకుల అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ రుణాలను సకాలంలో పునరుద్ధరించుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని బ్యాంకర్లను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రైతు భరోసా, ఆసరా పింఛన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే నిధులను ఇతర రుణాల బకాయిల పేరుతో నిలుపుదల చేయరాదని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ రంగం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అర్హులైన రైతులు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన రుణ సహకారం అందించాలని అన్నారు . జిల్లాలో ఉపాధి, ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా బ్యాంకులు రుణాల పంపిణీలో మరింత చొరవ చూపాలని సూచించారు.పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.3.24 కోట్ల లక్ష్యానికి గాను రూ.18.73 కోట్లు మంజూరు చేసి 578.09 శాతం సాధన నమోదవడం సానుకూల పరిణామమని కలెక్టర్ అన్నారు . ఇతర విభాగాల్లో రూ.152.35 కోట్ల లక్ష్యానికి గాను రూ.86.62 కోట్లు మంజూరు చేసి 56.86 శాతం సాధన నమోదైనట్లు తెలిపారు.స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) తగ్గింపు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన పీఎం స్వనిధి, పీఎంఈజీపీ, పీఎం ముద్ర, పీఎం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) అమలుపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం 2026–27 ఆర్థిక సంవత్సరానికి భారతీయ స్టేట్ బ్యాంక్ రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. రూ.8,914 కోట్ల లక్ష్యంతో రూపొందించిన ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.4,593 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి రూ.889 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.221 కోట్లు, ఇతర రంగాలకు రూ.3,211 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారులు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, రిజర్వ్ బ్యాంక్ అధికారులు, నాబార్డ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ లో ఫాదర్స్ డే , యోగా వేడుకలు

కొండాపూర్, నేటి శుభోదయ : శేరిలింగంపల్లి నియోజకవర్గం శ్రీరామ్ న గర్ బి ,బ్లాక్ శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు చేయించి యోగ చేయడం వలన కలిగే లాభాలను వివరించి తెలిపారు. సూర్య నమస్కారాల వలనఎలాంటి జబ్బులు రాకుండా మనిషి దృఢంగా తయారవుతారని ప్రిన్సిపాల్ సుధా అన్నారు . ఫాదర్స్ డే సందర్భంగాఫాదర్స్ డే కేవలం ఒక వేడుక మాత్రం కాదు. తండ్రులకు, తండ్రి లాంటి వ్యక్తులకు గౌరవాన్ని కృతజ్ఞతను తెలియజేయడానికి ఈ ఒక్క అవకాశం. తండ్రులు తమ పిల్లలకు ఆర్థిక భద్రతను అందించడమే కాకుండా వారికి ముఖ్యమైన విలువలు, క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం సవాలను. ఎదురుకునే సామర్థ్యాన్ని కూడా నేర్పిస్తారు. వారి సేవలను గుర్తు చేసుకొని కృతజ్ఞతలు తెలియ జేయడానికి ఈ రోజు ఒక అద్భుతమైన అవకాశం గా మనం భావించి తల్లిదండ్రులను దైవ సమానులుగా ప్రతి విషయంలో తోడు ఉండాలని ప్రిన్సిపాల్ సుధా స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది.

వార్షిక విద్యా ప్రణాళికపై సమావేశం
- ఎంఈవో దాసరి లక్ష్మి

మంథని, నేటి శుభోదయ : మంథని మండల వార్షిక విద్యా ప్రణాళిక గురించి మంథని మండలంలోని ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దాసరి లక్ష్మి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా ఉపాధ్యాయులంతా ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ రిపోర్టుల విషయంలోనూ మరియు విద్యార్థుల ప్రగతిని మెరుగుపరిచే దిశగా ప్రయత్నం చేసి పెద్దపల్లి జిల్లాలో మంథని మండల స్థానాన్ని మరింత ముందుకు తెచ్చేలా కృషి చేయాలని కోరారు. పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్ల మదింపులో పెద్దపెల్లి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించినందుకు గాను అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇదే విధంగా కృషి చేసి మంచి ఫలితాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పిహెచ్ఎస్ బాయ్స్, జి హెచ్ ఎస్, ఆరెంద పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, జె.సురేష్ కుమార్, ఈదులపల్లి నరసింహారావు లు మాట్లాడుతూ తమ పాఠశాల సముదాలలో పనిచేసే ఉపాధ్యాయులంతా ఎఫ్ ఎల్ ఎన్ లోని అన్ని సామర్థ్యాలలో మంచి ఫలితాలు వచ్చేలాగా కృషి చేయాలని తద్వారా స్కూల్ కాంప్లెక్స్ యొక్క ర్యాంకింగ్ ను పెంచాలని కోరారు. జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ గత సంవత్సరం లాగా అనే ఈ సంవత్సరం కూడా ఉపాధ్యాయులంతా తమ తమ పాఠశాలలో అద్భుతమైన ఫలితాలను సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా మంథని మండలంలోని మల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఎగ్గడి సురేష్ గత విద్యా సంవత్సరం పాఠశాల మొత్తం హాజరులో 90% హాజరు సాధించినందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ గారు అందజేసిన ప్రశంసపత్రాన్ని ఎం ఈ ఓ మరియు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందుకున్నారు. ఇట్టి అరుదైన ప్రశంసను అందుకున్నందుకు ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు మల్లయ్య, సుప్రజ, రాధిక, స్వప్న, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్పీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా బొడ్డు బాబురావు ఎన్నిక

నేలకొండపల్లి, నేటి శుభోదయ : బహుజన్ సమాజ్ పార్టీ నేలకొండపల్లి మండలం అధ్యక్షుడిగా బొడ్డు బాబురావు ఎన్నిక అయ్యారు. మండలం లోని పైనంపల్లి గ్రామానికి చెందిన బొడ్డు బాబురావు అనేక సేవా కార్యక్రమాలను చేస్తూ పేద ప్రజలకు అండగా నిలిచారు. సెక్టార్ అధ్యక్షుడిగా, మండల ప్రధాన కార్యదర్శి గా అంచెలంచెలుగా ఎదిగారు. వారి సేవలను గుర్తించిన పార్టీ మండల అధ్యక్షులుగా నియమించింది. బొడ్డు బాబురావు నియామకం పట్ల నేలకొండపల్లి ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జి బుర్ర ఉపేంద్ర సాహు,జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వర్ రావు, రాష్ట్ర నాయకులు పల్లెపొంగు విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు, ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా కార్యదర్శులు బి.ఉపేందర్, కారుమంచి నాగరాజు, కోటయ్య, సతీష్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని మండలంలో జరిగే సీఎం సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

ఖమ్మం, నేటి శుభోదయ : చింతకాని మండలంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో రైతుమేళా నిర్వహించనున్నట్లు, అట్టి రైతు మేళా లో ఈ నెల 30 న ముఖ్యమంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నే సభ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించే రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రైతు మేళా విజయవంతానికి పకడ్బందీ ప్రణాళిక, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రైతు మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 150 స్టాల్స్ ఏర్పాటు చేసే ఈమేళాకు జిల్లా నుండి రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకోవాలని, ఈ అవకాశాన్ని అన్న దాతలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. శాస్త్రవేత్తలు రైతు మేళాలో పాల్గొననున్నందున వారికి బస, రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, పిడి మెప్మా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం

షాద్నగర్, నేటి శుభోదయ : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిని కలిసి బ్రాహ్మణ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపనయనాలు, వివాహాలు వంటి శుభకార్యాలు నిర్వహించేందుకు తమకు సొంత భవనం లేక పోవడంతో అద్దె భవనాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. బ్రాహ్మణ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని, సంఘం సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కూడా సంఘ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సుజీవన్, సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ర, వేణుగోపాలకృష్ణ, చిలుకూరి రామ్, సత్యనారాయణ శర్మ, ప్రవీణ్ కుమార్, రఘుపతి రావు, రాదేశం, రవి శర్మ, భాను శర్మ, రాజశేఖర్ శర్మ, కమల్ కిషోర్ శర్మ, వసుంధర, రాజగోపాల్, మనోజ్ కుమార్, రాజేష్, సుదర్శన్‌రావు, కృష్ణమోహన్, శ్రీనివాసరావు, కమల, సౌమ్య, శిరీష, గాయత్రి, గీత, న్యాయసలహాదారు నర్వ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు..

అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి

షాద్నగర్, నేటి శుభోదయ : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం పరిధిలో నందిగామ మండలం అయ్యప్పస్వామి దేవాలయం లో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో జరుగుతున్న పనులను గిరీష్ నాయర్ గురుస్వామినీ అడిగి తెలుసుకోవడం జరిగింది,ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త. రేగొండ రవీందర్ రెడ్డి, బంటారం సుదర్శన్ గౌడ్,ఏరోళ్ల శ్రీధర్ గౌడ్,శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

అధికార కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసిన సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి ప్రతినిధి, నేటి శుభోదయ :
సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల సమస్యలు, భూముల అంశం, వ్యవసాయ రంగ పరిస్థితులు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలపై విస్తృతంగా మాట్లాడారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వ్యాఖ్యలు
క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రులు రైతుల నడ్డి విరిచే రకంగా, అధ్యాయాన్ని నింపే విధంగా వారి రైతులకు ద్రోహం చేసేలా మాట్లాడుతున్నారని అన్నారు. అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాధలుగా మార్చే దుర్మార్గానికి కాంగ్రెస్ పార్టీ దిగజారిందని విమర్శించారు.కేంద్రం చెప్పిన కోట వరకు మాత్రమే పంటలు కొంటామని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనంగా ఒక్క గింజ కూడా కొనబోమని చెప్పడం రైతులకు మరణశాసనం లాంటిదన్నారు. వ్యవసాయాన్ని ఇప్పటికే సంక్షోభంలోకి నెట్టి రైతు బతుకును ఛిన్నాభిన్నం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపించారు.పదే ళ్లపాటు ధైర్యంగా బతికిన రైతును మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి కష్టాల్లోకి నెట్టారని విమర్శించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధువుగా రైతు కష్టాలు తెలిసిన నాయకుడిగా రాష్ట్రంలో అన్నదాతలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా దేశానికే ఆదర్శంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు.రాష్ట్రంలో పది సంవత్సరాలు స్వర్ణయుగంలా కేసీఆర్ పాలన సాగిందన్నారు. దశాబ్దాల చరిత్రలో ఏ పాలకుడు ఆలోచించని విధంగా రైతుబంధు పేరుతో పెట్టుబడి సహాయాన్ని ప్రవేశపెట్టి 11 విడతల్లో రూ.72 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసి దేశంలో చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు.రైతు కుటుంబానికి ఏమైనా జరిగితే రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో రూ.5 లక్షల రైతు బీమా అమలు చేశామని చెప్పారు. రైతుబంధుకు రూ.72 వేల కోట్లు, రైతు రుణమాఫీకి రూ.29 వేల కోట్లు, రైతు బీమాకు రూ.6,800 కోట్లు ఖర్చు చేసి రైతుల ఖాతాల్లో లక్ష కోట్లకు పైగా నేరుగా జమ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.స్వతంత్ర భారతదేశంలో తొలి సారిగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి చరిత్ర సృష్టించామని తెలిపారు. రైతు కేంద్రబిందువుగా సాగిన పాలన వల్ల తెలంగాణలో వ్యవసాయ విప్లవం వచ్చిందని, నెరెలు బారిన నేలలు పచ్చని మాగాణాలుగా మారాయని అన్నారు.2014కు ముందు వానాకాలం, యాసంగి కలిపి కోటి 31 లక్షల ఎకరాల పంట విస్తీర్ణం ఉండగా, 2023 నాటికి అది 2 కోట్ల 30 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. అన్ని రకాల పంటల ఉత్పత్తితో తెలంగాణ దేశానికే ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారిందన్నారు.కరోనా కష్టకాలంలో 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు కల్లాల వద్దే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుకు అండగా నిలిచారని చెప్పారు. మద్దతు ధరకు కేవలం వరిధాన్యమే కాకుండా మొక్కజొన్న, జొన్న, శనగ, కందులు, పెసలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను కూడా కొనుగోలు చేశామని గుర్తు చేశారు.రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.రాష్ట్రంలోని ప్రజల పక్షాన, రైతుల పక్షాన వారికి అండగా ఉంటూ బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మళ్లీ కేసీఆర్ రావాలి, కేసీఆర్ వస్తేనే మా బతుకులు బాగుంటాయని ప్రజలు భావిస్తున్నారని అన్నారు.కేసీఆర్ పాలనలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ సొమ్మును ఢిల్లీకి పంపడమే చేస్తున్నారని ఆరోపించారు.నియోజకవర్గంలో పది సంవత్సరాల పాటు భూములను కాపాడామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.ఈ అంశంపై సంబంధిత మంత్రులను, జిల్లా కలెక్టర్‌ను కలిసి రైతుల భూములు కాపాడాలని, వారికి రావాల్సిన పరిహారం ఇవ్వాలని, అన్యాయంగా భూములు తీసుకోవద్దని కోరామని చెప్పారు. రైతులను భయపెట్టి "మీకు ఒక్క రూపాయి రాదు" అని బలవంతంగా భూములు తీసుకుంటున్నారని ఆరోపించారు.గతంలో ఓడిపోయినా వందల కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు తీసుకొచ్చామని, ఆ నిధులను కూడా రద్దు చేశారని అన్నారు. కొత్తగా నిధులు తీసుకురాకుండా ప్రచారమే చేస్తున్నారని విమర్శించారు.అక్రమాలు ఎక్కడ జరిగినా ఊరుకోమని, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, పేద ప్రజలను భయపెట్టి భూములు తీసుకోవడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో మాజీ CDC చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, నాయకులు శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ నాయక్, సాబేర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో 21.100 కిలోల ఎండు గంజాయి, 30 లీటర్ల నాటు సారాయి పట్టివేత

- రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం – నలుగురు అరెస్ట్.

భద్రాద్రి కొత్తగూడెం, నేటి శుభోదయ :
ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 21.100 కిలోల ఎండు గంజాయి, 30 లీటర్ల నాటు సారాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనల్లో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్దన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఈఎస్ కె. తిరుపతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సి.హెచ్. శ్రీహరిరావు సిబ్బందితో కలిసి కూనవరం–భద్రాచలం మార్గంలోని ఇసుక రీచ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని పల్సర్-150 ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 21.100 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన అజార్ షకీల్ షేక్, అంకుష్ వినాయక్ పవార్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు నుంచి మహారాష్ట్రలోని తుల్జానగర్‌కు గంజాయిని తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అనంతరం భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో హీరో గ్లామర్ (ఏపీ 04 ఏవీ 4074) ద్విచక్ర వాహనంపై ఉన్న మూడు ప్లాస్టిక్ క్యాన్లలో 30 లీటర్ల నాటు సారాయి లభ్యమైంది. ఎర్రగుంటకు చెందిన మడవి ఐత, కూరం అర్జున్‌లు నాటు సారాయిని భద్రాచలానికి తరలిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ఈ రెండు ఘటనలపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న గంజాయి, నాటు సారాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు శివ కుమార్, వీరబాబు, తిరుపతి, ఉపేందర్, డ్రైవర్ సాయికుమార్ పాల్గొన్నారు.టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వండిగంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1800-425-2523 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎక్సైజ్ ఎస్ఐ సి.హెచ్. శ్రీహరిరావు తెలిపారు.

మైలార్‌దేవ్‌పల్లి దాసర బస్తీలో 'బడిబాట'సందడి

- అంగన్వాడీలోకి చేరిన చిన్నారులు

కాటేదాన్, నేటి శుభోదయ :
నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా శేరిలింగంపల్లి సెక్టర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని దాసర బస్తీ అంగన్వాడీ కేంద్రం కోలాహలంగా మారింది. ఇంటి వద్ద ఉంటున్న చిన్నారులను బడి వైపు నడిపించేందుకు 'బడిబాట' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీచర్ టి. సుమిత్ర ఆధ్వర్యంలో "అమ్మ మాట అంగన్వాడీ బాట" పేరిట జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక బస్తీ వాసులు, అంగన్వాడీలో నమోదైన గర్భిణులు, బాలింతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

అడ్మిషన్ల మహోత్సవం, అక్షరాభ్యాసం
ఈ సందర్భంగా కేంద్రంలో నూతన అడ్మిషన్ల మహోత్సవం చేపట్టారు. కొత్తగా చేరిన చిన్నారులకు సాంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి, విద్యాకుసుమాలను తరగతుల్లోకి సాదరంగా ఆహ్వానించారు. చిన్నారుల కేరింతలతో అంగన్వాడీ కేంద్రం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.

'అంగన్వాడీలే భవిష్యత్తుకు పునాది'
టీచర్ సుమిత్ర మాట్లాడుతూ, "చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు, వారి ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే తొలి పునాది" అని అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు.

"ఇక్కడ ఆటపాటలతో కూడిన నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నాం. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని సౌకర్యాలు మా వద్ద ఉన్నాయి. తల్లిదండ్రులందరూ ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకుని, తమ పిల్లలను ప్రభుత్వ అంగన్వాడీల్లో చేర్పించాలి" అని ఆమె కోరారు.

పిల్లల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పిన సుమిత్ర, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బస్తీ మహిళలకు, తల్లులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా సునీత, ఆశ వర్కర్ స్వాతి,కాలనీమహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బడిబాట ముఖ్య ఉద్దేశం
బడి బయట ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, పౌష్టికాహారం, సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం.

సమంత గర్భవతా..! సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియో

ప్రముఖ కథానాయిక సమంత గర్భవతి అంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్ర విజయోత్సవ వేడుకలకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ వీడియోలలో సమంతకు బేబీ బంప్ కనిపిస్తోందంటూ నెటిజన్ల మధ్య పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి పాల్గొన్నారు. వైట్ టీషర్ట్ ధరించిన సమంత, చిత్ర బృందంతో కలిసి కేక్ కట్ చేస్తున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే, ఈ వీడియోలలో ఆమె గర్భవతిలా కనిపిస్తున్నారంటూ పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. దీంతో అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. గతేడాది సమంత, రాజ్ నిడిమోరుల వివాహం అత్యంత సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా జరిగింది. కాగా, బీవీ నందిని రెడ్డి దర్శకత్వం వహించిన 'మా ఇంటి బంగారం' చిత్రం తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 13 కోట్లు వసూళ్లను రాబట్టి, సమంత కెరీర్‌కు మంచి కంబ్యాక్ ఇచ్చింది.

ఇదిగో మా క్లీంకార..

- తొలిసారి కుమార్తెను చూపించిన రామ్ చరణ్, ఉపాసన..

మెగా అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ముఖాన్ని తొలిసారి ప్రపంచానికి చూపించారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఉపాసన తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు కూతురు ముఖం కనిపించ కుండా జాగ్రత్తపడిన ఈ జంట మూడో బర్త్‌డే రోజున అభిమానులకు ప్రత్యేక కానుక ఇచ్చింది. ''మా అమూల్యమైన చిన్నారి క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు' ' అంటూ ఉపాసన తన ఫేస్‌బుక్ ఖాతాలో అందమైన తమ ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. పచ్చని ప్రకృతి మధ్యలో రామ్ చరణ్, ఉపాసన తమ గారాల పట్టిని ప్రేమగా ఎత్తుకుని ఉన్న ఈ చిత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. నీలి రంగు దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి అందరి చూపును కట్టిపడేస్తోంది. బుగ్గల నిండా నవ్వు, కళ్లలో అమాయకత్వం, ముఖంలో మెరిసే ఆనందం ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల ఒడిలో హాయిగా కూర్చుని నవ్వుతున్న మెగా వారసురాలు ఆ కుటుంబ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. కొందరు ఆమె కళ్లు తాత మెగాస్టార్ చిరంజీవి కళ్లలా ఉన్నాయని కామెంట్ చేస్తున్నారు. ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. మెగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు క్లీంకారకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మూడేళ్లుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆమె ఫేస్ రివీల్ కావడంతో ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి

- శోభిత ధూళిపాళ



అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి. ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా...

దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా.. "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్య పరిచారు. తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. "సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

బాలుడి ప్రాణం కాపాడేందుకు బండ్ల గణేశ్ 5 లక్షల సాయం..

- పవన్ కల్యాణ్ స్ఫూర్తితోనేనంటూ భావోద్వేగం!

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తనలోని ఉదారత్వాన్ని చాటుకుంటూ ఒక గొప్ప నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న హనుమకొండకు చెందిన చిన్నారి నిరంజన్ కుటుంబానికి తాను ప్రకటించిన రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ఈరోజు తన చేతుల మీదుగా అందజేశారు. హనుమకొండలోని హనుమాన్ నగర్‌లో ఉన్న చిన్నారి నిరంజన్ నివాసానికి బండ్ల గణేశ్ స్వయంగా వెళ్లారు. నిరంజన్‌తో కాసేపు ముచ్చటించి, ధైర్యం చెప్పారు. అతని ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలతో మాట్లాడి... తమ పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్ తరఫున రూ. 5 లక్షల చెక్‌ను వారికి అందజేశారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మీడియాతో మాట్లాడుతూ... "నేను పవన్ కల్యాణ్ గారి భక్తుడిని. దైవసమానులైన పవన్ కల్యాణ్ గారు ఈ బాబును పరామర్శించినప్పుడే నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ రోజు ఇక్కడికి వచ్చి ఆర్థిక సాయం చేశాను. నిజానికి మేమంతా ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి పవన్ కల్యాణ్ గారి దయే కారణం" అంటూ తన

'బాస్'పై ఉన్న భక్తిని చాటుకున్నారు. ప్రస్తుతం తన కూతురి వివాహ పనులతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ రోజే వచ్చి సాయం చేయాలని ఫిక్స్ అయినట్లు బండ్ల గణేశ్ చెప్పారు. "నారా భువనేశ్వరి గారి పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు ఈ రూ. 5 లక్షల సాయాన్ని నిరంజన్ కుటుంబానికి అందించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. బాబు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ పవిత్రమైన సందర్భంగా నేను ఎలాంటి రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు" అని స్పష్టం చేశారు.

మనసుకూ విశ్రాంతి అవసరం

- సోషల్ మీడియాకు బ్రేక్ ప్రకటించిన హీరోయిన్

ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి ఇచ్చినట్లే మనసుకు కూడా విశ్రాంతి అవసరమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా కొంతకాలం విశ్రాంతి తీసుకుని, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజ జీవితంతో మమేకం కావాలనుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఒక సుదీర్ఘ సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని ఆమె తన పోస్ట్‌లో రాశారు. "నాకు మద్దతుగా నిలిచిన, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం" అని ఆమె వివరించారు. కేవలం గత నెలలోనే కయాదు తన తమ్ముడు ఉదయ్ పుట్టినరోజు సందర్భంగా ఒక అందమైన పోస్ట్ చేశారు. "నువ్వు ఎంత పెరిగినా, నా దృష్టిలో ఎప్పటికీ చిన్నపిల్లవాడివే. జీవితంలో ఏదైనా కాకముందు, నేను మొదట అక్కనయ్యాను" అని ఆమె పేర్కొన్నారు. "నిన్ను తప్ప నా తమ్ముడిని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి వీల్లేదు" అని సరదాగా రాసుకొచ్చారు. ఇక, ఆమె సినీ కెరీర్ విషయానికొస్తే.. కయాదు లోహర్ ప్రస్తుతం దర్శకుడు మరియప్పన్ చిన్న రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమెకు జోడీగా ప్రముఖ నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ నటిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ చిత్రంలో జీవీ ప్రకాశ్, కయాదు లోహర్‌లతో పాటు టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620